


# విజయభాను




విశాఖపట్నం, ఆదివారం 30-12-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 95 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సేవా రంగంపై దృష్టిని
# కేంద్రీకరించాలి

**అభివృద్ధి దిశగా మెడిటెక్ పార్కుల ఏర్పాటు**

**పర్యాటక రంగ అభివృద్ధికి కృషి అవసరం**

**చిరుధాన్యాల వాడకంతో ఆరోగ్యానికి ప్రదాయకం**

**జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



విశాఖపట్నం: జనవరి 2 నుండి 11వ తేదీ వరకు జరగనున్న 6వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ 2014 సం. నుండి రాష్ట్ర



ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, వాటి విజయాలపై గ్రామాల్లో 10 రోజుల పాటు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. సేవా రంగంపై దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా పని చేయాలన్నారు. అధిక సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించే విధంగా రీసార్ట్స్ , హెూటల్స్‌ను అందుబాటులోకి తెచ్చి తద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగంలో ఫలితాలు సాధించాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులను అభివృద్ధి

తరువాయి 2లో..

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం..

**ద్వీపాలవాసులకు సునామీ హెచ్చరిక**



మనీలా: ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతంలోని మిందానావో ద్వీపంలో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టరు స్కేలుపై 6.9గా నమోదైందని అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ద్వీపంలోని జనరల్ శాంటోస్ అనే నగరానికి ఉత్తరాన 193కిలోమీటర్ల దూరంలో భూప్రకంపనలు సంభవించినట్లు తెలిపింది. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలో ఉన్న తీరాల్లో సునామీ వచ్చే ప్రమాదముందని పసిఫిక్ సునామీ కేంద్రం హెచ్చరించింది. అయితే అమెరికాకు చెందిన హవాయికి సునామీ ప్రమాదమేమీ లేదని స్పష్టంచేసింది. భూకంపం నేపథ్యంలో అక్కడి అధికారులు తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. హెచ్చరికల తీవ్రతను బట్టి ప్రజలు తీర ప్రాంతాలను ఖాళీ చేసి

తరువాయి 2లో..

# నిబద్ధతతో పని చేస్తున్నా

## ఎవ్వరినీ నిద్దరపోనివ్వను
## యూపీని మెడికల్ హబ్‌గా రూపుదిద్దుతా
## ప్రధాని నరేంద్ర మోదీ

లఖ్‌నవూ: కాంగ్రెస్ పార్టీ తీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ పట్ల, ఆ పార్టీ నేతలు చెబుతున్న అసత్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తనను కాపలాదారుడు అంటూ కాంగ్రెస్ చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తాను కాపలాదారుడిగా రాత్రింబవళ్లు పనిచేస్తున్నానని, దీంతో కొందరు దొంగలకు నిద్రపట్టడం లేదని విమర్శించారు. శనివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మహారాజా సుహేల్‌దేవ్ స్మారక స్టాంపులను విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... మహారాజా సుహేల్‌దేవ్ సేవలకు చిహ్నంగా శనివారం ఈ పోస్టల్ స్టాంపులను విడుదల చేశాం. దేశం కోసం పాటుపడిన వారి సేవలను ప్రజలకు గుర్తు చేయడంలో మా ప్రభుత్వం నిబద్ధతతో ఉంది. ఘాజీపూర్‌లో శనివారం శంకుస్థాపన చేసిన వైద్య కళాశాల ద్వారా వైద్య సదుపాయాలు మరింత మెరుగ్గా అందుతాయి. వైద్యులు కావాలన్న ఇక్కడి యువత కలలు కూడా ఈ కళాశాల ద్వారా నెరవేరుతాయి. ఉత్తర్‌ప్రదేశ్‌ను మెడికల్ హబ్‌గా రూపుదిద్దుతాం అని వ్యాఖ్యానించారు. కర్ణాటక శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్ర రైతులందరికీ రుణమాఫీ చేస్తామంటూ నమ్మించి, మభ్యపెట్టింది.



800 మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. ఎంతటి మోసం. ఆ పార్టీ పట్ల, ఆ పార్టీ నేతలు చెబుతున్న అసత్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అప్పుడే ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కోసం బారులు తీరి నిలబడుతున్నారు. హామీలను నెరవేర్చడానికి బదులు లాలీపాప్‌లు ఇస్తోంది. ఈ లాలీపాప్ సంస్థను మీరు ఎలా నమ్మగలరు? గతంలో ఆ పార్టీ

తరువాయి 2లో..

# ప్రజలతో మమేకమై..

**332వ రోజు ప్రజాసంకల్పయాత్ర ప్రారంభం**

శ్రీకాకుళం: ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని.. వారిలో భరోసా నింపేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర శ్రీకాకుళం జిల్లాలో దిగ్విజయంగా కొనసాగుతోంది. జననేత 332వ రోజు పాదయాత్రను శనివారం ఉదయం పాతపట్నం నియోజకవర్గం మెలియపుట్టి మండలంలోని రంగడి ఘాటి నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి తూముకొండ, పెద్దమాడి స్కూల్, హెరాపురం, పెద్దమాడి గ్రామం మీదుగా చీపురుపల్లి వరకు పాదయాత్ర చేస్తారు. అక్కడ లంచ్ విరామం తీసుకుంటారు.

విరామం అనంతరం పలాస నియోజవర్గంలోని రేగులపాడు, టెక్కలిపట్నం, మోదుగులపుట్టి మీదుగా ఉండ్రుకుడియా క్రాస్ వరకు పాదయాత్ర కొనసాగుతుంది. అడుగు ముందుకు పడనీయని అభిమానం, కాలు కదపనీయని అనురాగం, దారి పొడవునా మంగళహారతులు, ప్రజా సమస్యలపై వినతులు, విజ్ఞప్తులతో జననేత పాదయాత్ర ముందుకు కదులుతోంది. రాజన్న తనయున్ని చూడటానికి, మాట్లాడటానికి, పాదయాత్రలో తాము భాగం కావాలని ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివస్తున్నారు.



# విహంగ వీక్షణంలో నగర అందాలు

**విశాఖ ఉత్సవ్‌లో భాగంగా హెలిటూరిజం ప్రారంభం**



వార్త 8వ పేజీలో..




## చంద్రబాబుకు ఓటమి భయం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ**



విజయవాడ: సీఎం చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. అబద్ధాలు, అసత్యాలు చెబుతూ శ్వేతపత్రాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి కేంద్రం సాయం చేయడంలేదని ఆరోపించడం అన్యాయమని, కడప స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంపై బురదజల్లుతున్నారని కన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రతి చర్య, ప్రతి మాట మోసమేనని విమర్శించారు. ఏపీలో హైకోర్టు ఏర్పాటుతో జగన్‌కు ఏ విధంగా లబ్ధి చేకూరుతుందో చంద్రబాబు చెప్పాలని కన్నా ప్రశ్నించారు.



## 2013 భూసేకరణ చట్టం ప్రకారం

# పట్టా వున్నా లేకున్నా సమానంగా పరిహారం చెల్లించాలి

## జాయింట్ కలెక్టర్‌కి సిపిఎం, వంగలి గ్రామస్తులు వినతి



విశాఖపట్నం : సబ్బవరం మండలం వంగలిలో పెట్రోలియం యూనివర్సిటీ కోసం భూములు కోల్పోయి హైకోర్టును ఆశ్రయించిన రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. స్థానిక తహశీల్దార్ కోర్టును ఆశ్రయించిన వారికి నోటీసులు జారీ చేస్తూ పట్టా వున్న భూమికి ఎకరాకు 18లక్షల 55వేలు చెల్లిస్తామని, పట్టాలేని భూములు ప్రభుత్వ భూములని 4సిగాని, నాన్ 4సి గాని కావని ప్రభుత్వం ఆ భూములు స్వాధీనం చేసుకుంటామని నోటీ సులో తెలియజేశారు. ఈ విధంగా రైతులకు నోటీసులు జారీచేస్తూ గందరగోళంకు గురిచేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కార్యదర్శి కె.లోకనాథం నాయకత్వంలో రైతు సంఘం నాయకులు, వంగలి గ్రామస్తులు ఈ రోజు జిల్లా జాయింట్ కలెక్టర్ గారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. హైకోర్టులో కేసు వుంటుండగా ఈ విధంగా నోటీసులు ఇవ్వడం చట్ట విరుద్ధం. గత 40ఏళ్ళగా వంగలిలో భూములను రైతులు సాగుచేసుకుంటున్నారు. ఈ భూములపై అన్ని హక్కులు రైతులకే వున్నాయని, వారే సాగుచేసుకుంటు న్నారని అధికారికంగా స్థానిక తహశీల్దార్ ధ్రువీకరించారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం పట్టా వున్న భూములకు, పట్టాలేని భూములకు సమానమైన పరిహారం చెల్లిం చాలని, కూలీలకు, చేతివృత్తిదారులకు, చిరువ్యాపార స్తులకు 5లక్షల ప్యాకేజీగాని, లేదా 2వేల రూపాయలు చొప్పున 25 సంవత్సరాలు భృతిగాని చెల్లించాలని వుంది. కాని అవేవి పరిష్కారం చేయకుండా బలవంతంగా భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేయడం అన్యాయం. హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్నందున తీర్పు వచ్చే వరకు తమ భూములపై ఎటువంటి దౌర్జన్య చర్యలు చేయరాదని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌కి విన్నవించడం జరిగింది. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ దీనిని అధ్యయనం చేసి తగిన చర్యలు చేపడతామని తెలియజేశారు. జాయింట్ కలెక్టర్‌ని కలిసిన వారిలో రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, వంగలి గ్రామస్తులు యర్రా సోంబాబు, సుంకర చిన్న కృష్ణ, పెద్ద కృష్ణ, గవర రామునాయుడు, యర్రా సోము నాయుడు, కందా అప్పారావు, పూడి రాము నాయుడు, ఎ.దేముళ్ళు, యర్రా సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శన విజేతలు రాష్ట్ర స్థాయికి ఎంపిక

విజయనగరం : జిల్లాలో బొండపల్లిలోని గొట్లం గాయత్రి టెక్నో పాఠశాల్లో గత రెండురోజులుగా నిర్వహించిన 46వ జవహర్ లాల్ నెహ్రూ జాతీయ వైజ్ఞానికి , గణిత, పర్యావరణ ప్రదర్శనలో విజేతలను విశాఖలో (చంద్రం పాలెం)లో 30,31వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు పంపిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి తెలిపారు.

సేంద్రియ వ్యవాం విభాగంలో జెడ్పీ హైస్కూల్ ఆరిక తోట బృందం (వ్యక్తిగత), జెడ్పీ హైస్కూల్ వి.బి.పురం గ్రూప్ ఎంపిక అయ్యారు. ఆరోగ్యం-పరిశుభ్రతలో గంట్యాడ జెడ్పీ హైస్కూల్(వ్యక్తిగత), బొప్పడాం జెడ్పీ హైస్కూల్ (గ్రూప్) ఎంపిక అయ్యారు.

వనరుల నిర్వహణలో జెడ్పీ హైస్కూల్‌నెలివాడ వ్యక్తిగత, జెడ్పీ హైస్కూల్ (బుడత నాపల్లి) గ్రూప్‌కు ఎంపిక అయ్యారు.

వ్యర్థాల నిర్వహణాలో జరజాపేట జెడ్పీ హైస్కూల్ వ్యక్తిగత, గొట్లాం టెక్నో గ్రూప్ విభాగంలో ఎంపిక అయ్యారు. గణిత నమూనాలో కోనాడ జెడ్పీ హైస్కూల్‌వ్యక్తిగత, నడుపూర్ జెడ్పీ హైస్కూల్ బృందంలో ఎంపిక అయ్యారు.

మొయిద, లక్కిడాం, జరజాపేపేట, కొండకెంగువ జెడ్పీ హైస్కూల్‌టీచర్లు బి.శ్రీనివాసరావు, ఎస్.త్రినాథరావు, వి.చిన్నం నాయుడు, బి.మధుకుమార్‌ఎస్.రాజేష్, ఎ.కిశోర్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## మాధవపూర్ నగర్‌ను సందర్శించిన జడ్పిటిసీల బృందం



పరవాడ: పోరుబంధర్ జిల్లాలో గల పోరుబంధర్ మండలంలో మాధవపూర్ నగర పంచాయతీనీ శనివారము విశాఖ జిల్లా జడ్పి టీసీలు బృందం సందర్శిం చారు. ఈ పంచాయితీలో సర్పంచ్ దివేశ్ బి కర్గాటియా,ఉప సర్పంచ్ .రాజేశ్ బి కర్గాటియా, పట్వారీ (పంచాయతీ కార్యదర్శి) ఎమ్.జి. మజితియా 18వార్డు మెంబర్స్ రెండు బ్యాంకులు గలవు, కేంద్ర రాష్ట్ర నిధులు అన్ని కలిపి సుమారు 1,50,00,000 వరకు నిధులు గ్రామ పంచాయతీకి విడుదల అవుతాయిని సర్పంచ్ తెలిపారు. ఈ గ్రామ పంచాయితీ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం కలదు.అన్ని ఇళ్ళకి మరుగు దొడ్లు కలవుఅని అన్నారు.అదేవిధంగా బహిరంగ మాల విసర్జన లేదు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు.పాడి పరిశ్రమను బాగా ఎక్కువగా అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడ రైతులకు ఉచిత విద్యుత్ లేదు..కానీ ప్రతి రైతు సంవత్స రానికి రూ.3000/- కడితే అపరిమిత విద్యుత్ ను వ్యవసాయానికి అందిస్తారని సర్పంచ్ వివరించారు. ఈకార్యక్రమంలో విశాఖజిల్లాపరిషత్ చైర్మన్ లాలంభవాని, ఉత్తమ జిల్లా జడ్పిటీసి అవార్డు గ్రహీత,పరవాడజిల్లా ప్రాదేశికసభ్యులు పైలజగన్నాదరావు తదితరులు పాల్గొన్నారు.

## సెంచూరియన్ విశ్వవిద్యాలయ విద్యార్థుల సందర్శన



గొలుగొండ : శనివారం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఒరిస్సాకు చెందిన సెంచూరియన్ విశ్వ విద్యాలయ అగ్రికల్చరల్ విద్యార్థుల బృందం మండలంలో క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. గొలుగొండ మండలం చోద్యం గ్రామాల్లో ఉన్న కూరగాయల పెంపకం క్షేత్రాలను పరిశీలించారు. సందర్శనలో భాగంగా రైతులు కూరగాయలు, పండ్ల తోటలను సాగు చేసే విధానాన్ని విద్యార్థుల బృందం అడిగి తెలుసుకున్నారు. అలాగే కూరగాయల సాగులో రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ పద్ధతులను, సూచనలను రైతులకు అందజేశారు. ఈ క్షేత్ర సందర్శనకు బాధ్యత వహించిన కృషి విజ్ఞాన కేంద్ర హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ జివి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతాలలో రైతు క్షేత్ర పాఠశాలలను త్వరలో ప్రారంభించనున్నామని, దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రాంత సందర్శనకు తీసుకువచ్చామన్నారు. ఈ లింగంపేటకు చెందిన సాగు రైతు పరవాడ కవిశేశ్వరరావు, విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

## జనసేనతో జతకడతాం

### రెండు రోజులపాటు ప్రత్యేక రాజకీయ సమావేశాలు

కాకినాడ: భారత దేశంలో ప్రజా స్వామ్యం బతికి బట్టకట్టాలంటే మూడవ ఫ్రంట్ ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పేర్కొన్నారు. కాకినాడ సాంబమూర్తినగర్‌లోని సిపిఐ కార్యలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, ప్రతిపక్షనాయకుడు జగన్ ముగ్గురు మూడు విధాలుగా రాష్ట్ర ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.మోడీ ప్రభుత్వంలో రైతులకు ఒరిగిందేమీలేదన్నారు. ఎన్నడూ లేని విదంగా వ్యవసాయం సంక్షోబానికి గురైయ్యిందన్నారు. రాష్ట్రంలో రైతు రుణ మాఫీలను ప్రచారం కోసం మాత్రమే చంద్రబాబు నాయుడు ఉపయోగించు కొంటున్నాడని ఎద్దేవా చేసారు. సమర్థ వంత మైన ప్రతిపక్షంగా ఉండాల్సిన వైఎస్సార్ పార్టీ నాయకుడు జగన్ మోహన రెడ్డి రైతుల గోడు వదలి రోడ్లు పట్టుకొని తిరుగుతూ పాదయాత్రల పేరిట పబ్బంగడుపుకొంటున్నారని విమర్శించారు. ప్రజలకోసం శ్రమించే పార్టీలతో జత కట్టేందుకు సిపిఐ పార్టీ రాజకీయ తీర్మానాన్ని కాకినాడలో రెండు రోజలు పాటు జరిగే సిపిఐ పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆమోదిస్తామని ప్రకటించారు .ప్రస్తుతం ప్రజలకు దగ్గరగా ఉన్న పార్టీగా, ప్రజలకోసం పోరాడే పార్టీగా ఉన్న జనసేన పార్టీతో కలసి పయనించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29, 30 తేదీలలో కాకినాడ కాస్మోపాలిటిన్ క్లబ్‌లో జరగనున్న రాజకీయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకుంటామన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు , నగర కార్యదర్శి నక్కా కిషోర్, ఎఐటియుసి నగర కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, జిల్లా రైతు సంఘం కార్యదర్శి తోకల ప్రసాద్‌తదితరులు పాల్గొన్నారు.

## 6వ విడత జన్మభూమి- మా వూరు కార్యక్రమం సందర్భంగా

## విద్యార్థులకు క్రీడాపోటీలు

విజయనగరం : వచ్చేనెల జరగనున్న 6వ విడత జన్మభూమి-మావూరు కార్యక్రమం సందర్భంగా జిల్లాలో అన్ని మున్సిపల్, మండల కేంద్రాలలో హైస్కూల్ విద్యా ర్థులకు 5కె రన్, ఖోఖో, కబ్బాడీ, వాలీబాల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరి జవహర్‌లాల్ తెలిపారు.

ఆరోజు ఉదయం 6.30 నుండి 7.30 కు 5 కె రన్, ప్రారంభించాలన్నారు. విజేతలకు షీల్డులు ఇవ్వాలని జెడ్పీ హైస్కూల్ హెడ్మాష్టర్లు, ఎంపి డిఓలు, పిఇటిలు క్రీడలను పర్యవేక్షించాలని ఆదేశిం చారు. ప్రజాప్రతినిధులను, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సంఘా లను, యువతని, డ్వాక్రా సంఘాలను, జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులను ఆహ్వానించాలని తెలిపారు.

## విద్యుత్ సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి

అమరావతి: విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకప్పుడు విద్యుత్ రంగంలో చీకట్లు ఉండేవని, ప్రస్తుతం మిగులు విద్యుత్ సాధించామని చెప్పారు. ఇంధన రంగంలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నామని తెలిపారు. ఈ మేరకు ప్రజా వేదిక హాలులో శనివారం ఏడో శ్వేతపత్రం విడుదల చేశారు. ఇంధన రంగం, మౌలిక వసతులు కల్పనపై ఆయన శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడారు.

పారిశ్రామికాభివృద్ధికి, ఆర్థిక అభ్యున్నతికి మూలం మౌలిక రంగం. అందుకే ఆ రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మొత్తం 617 అవార్డులు ఆంధ్రప్రదేశ్‌ను వరించాయి. 1998లోనే తొలి తరం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. సంస్కరణల వల్ల దేశంలో ఇంధన రంగంలో అగ్రగామిగా ఉన్నాం. 2004 నుంచి 2014 వరకు విద్యుత్ రంగంలో చీకట్లు ఉన్నాయి. తొలిసారిగా ప్రైవేట్ రంగంలో విద్యుత్పత్తి కేంద్రాలు వచ్చాయి. రాష్ట్ర విభజన వల్ల మరింత కష్టాల్లోకి విద్యుత్ రంగం వెళ్లింది. తక్కువ కాలంలోనే మిగులు విద్యుత్ సాధించాం. రెండోతరం విద్యుత్ సంస్కరణలు ప్రవేశపెట్టాం. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై దృష్టిపెట్టాం. సౌర, పవన, హైబ్రీడ్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం ఇచ్చాం. విద్యుత్ ఉత్పత్తిపైనే కాకుండా సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించగలిగాం. స్వల్పకాలంలోనే మిగుల విద్యుత్ సాధించాం.

**మొదటి పేజీ తరువాయి**

## నిబద్ధతతో పని చేస్తున్నా

అధికారంలో ఉన్న సమయంలోనూ రైతు రుణమాఫీ చేయలేదు. ఇప్పుడెలా చేయగలదు? మీ కాపలాదారుడు (నేను) రాత్రింబవళ్లు కష్టపడి, నిబద్ధతతో పనిచేస్తున్నాడు. మీరు నాపై నమ్మకాన్ని ఇలాగే ఉంచి, నన్ను ఆశీర్వదించండి. దొంగలను ఏదో ఒక రోజు సరైన ప్రదేశానికి (జైలుకి) పంపడానికి మీ నమ్మకమే నాకు బలాన్నిస్తుంది అని మోదీ అన్నారు.

## సేవా రంగంపై దృష్టిని కేంద్రీకరించాలి

చేస్తామన్నారు. మెడిటెక్ పార్క్‌ను ఒక అత్యుత్తమ విధానంగా రూపొందించి అభివృద్ధి చేయనున్నామన్నారు. జన్మభూమి కార్యక్రమంలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. రోడ్లు, డ్రైన్లు తదితర సదుపాయాలని శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేయాలన్నారు. సామూహిక గృహ ప్రవేశాలను పండగలా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జన్మభూమిలోగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్నారు. చంద్రన్నబీమా, చంద్రన్న పెళ్లి కానుక, తదితర పథకాలకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. అన్ని నియోజకవర్గాలలో అన్న క్యాంటీన్లను ఫిబ్రవరి నాటికి ప్రారంభించేలా చూడాలన్నారు.

ఈ సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతున్నదన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లు ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం..

వెళ్లిపోవాలని సూచించారు. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేషియాలోని కొన్ని ద్వీపాలకు కూడా సునామీ హెచ్చరికలు జారీ చేశారు. భూకంపం వల్ల కలిగిన నష్టం వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. ఇటీవల ఇండోనేషియాలో క్రకటోవా అగ్నిపర్వతం బద్దలవ్వడంతో భారీ సునామీ సంభవించి 400మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# గెలుపు ముంగిట టీమిండియా



మెల్‌బోర్న్: ఆసీస్‌తో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో భారత్ విజయం ముంగిట నిలిచింది. చారిత్రక విజయానికి కోహ్లీ సేనకు కావాల్సింది మరో రెండు వికెట్లే. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ ఎనిమిది వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్ చేరిన తీరు చూస్తే నాలుగో రోజే టెస్టు పూర్తవుతుందని అనుకున్నారంతా. టాప్, మిడిలార్డర్లు విఫలమయినప్పటికీ టెయిలెండర్లు కుదురుకున్నారు. మరో 30 నిమిషాలు అట పొడిగించినప్పటికీ భారత్‌కు వికెట్లు మాత్రం చిక్కలేదు. జడేజా మూడు వికెట్లు, బుమ్రా, షమీ చెరో రెండు వికెట్లు తీయగా ఇషాంత్ ఖాతాలో ఒక వికెట్ పడింది. దీంతో ఆతిథ్య జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 258 పరుగులు చేయగలిందిది. ప్రస్తుతం టీమిండియా 141 పరుగులు ఆధిక్యంలో ఉంది.

**ఆదిలోనే దెబ్బకొట్టారు..**

మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భాగంగా టీమిండియా 54/5 ఓవర్ నైట్ స్కోరుతో నాలుగో రోజు ఆటను కొనసాగించింది. అయితే భారత బ్యాట్స్‌మెన్ వెంటవెంటనే పెవిలియన్‌కు చేరుకున్నారు. దీంతో కోహ్లీసేన ఎనిమిది వికెట్ల నష్టానికి 106పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 399పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పైన్ సేనను టీమిండియా బౌలర్లు ఆదిలోనే అడ్డుకున్నారు. బుమ్రా వేసిన తొలిఓవర్ రెండో బంతికే ఓపెనర్ ఫించ్(3; 4బంతుల్లో) కోహ్లీ చేతికి చిక్కాడు. తర్వాత మరో ఓపెనర్‌ను ఔట్ చేయడానికి టీమిండియాకు ఎంతో సమయం పట్టలేదు. 10వ ఓవర్లో జడేజా వేసిన బంతి మయాంక్ చేతికి చిక్కడంతో మార్కస్ హారిస్(13) పెవిలియన్ చేరాడు. క్రీజులో పాతుకుపోయి చాలా సేపటి వరకు భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించిన షాన్ మార్ష్‌ను బుమ్రా బయటకు పంపాడు. 33వ ఓవర్లో బుమ్రా వేసిన బంతికి అర్ధ శతకానికి చేరువైన మార్ష్(44) ఎల్బీగా వెనుదిరిగాడు. టీమిండియా బౌలర్లు 40 ఓవర్లకే ఆసీస్ టాప్ ఆర్డర్‌ను కూల్చేశారు.

**మిడిలార్డర్ కూడా ఢమాల్...**

టాప్ ఆర్డర్ కుదేలవ్వడంతో ఆసీస్ మిడిలార్డర్‌పై ఆధార పడాల్సి వచ్చింది. దీంతో ఆసీస్ ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత తీసుకున్న ట్రావిస్ హెడ్ కాసేపు బౌలర్లను తట్టుకుని నిలబడ్డాడు. భారీషాట్లు ఆడుతూ రెండు మూడు సార్లు బౌలర్ల దాడి నుంచి తప్పించుకున్న హెడ్ ఈసారి ఇషాంత్‌కు చిక్కాడు. 51వ ఓవర్లో ఇషాంత్ బౌలింగ్‌లో హెడ్(34) బౌల్డ్ అయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 157 మాత్రమే. ఇంకా 242 పరుగుల లక్ష్య ఛేదన ముందు ఉండటంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెరిగింది. ఈ తర్వాత మ్యాచ్ బాధ్యతను భుజాన వేసుకున్న ఆతిథ్య జట్టు సారథి టిమ్‌పైన్ ఆరంభంలో మెరుపులు మెరిపించాడు. అయితే వ్యక్తిగత స్కోరు 26 వద్ద పైన్ జడేజా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. దీంతో మ్యాచ్ భారం పూర్తిగా టెయిలెండర్ల మీద పడింది.

**కమిన్స్ అర్ధ శతకం..**

మరో ఎండ్‌లో ఉన్న మిచెల్ స్టార్క్ సైతం జట్టును ఆదుకోలేకపోయాడు. స్టార్క్ కూడా 18 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్ బాట పట్టాల్సి వచ్చింది. 71 ఓవర్లో షమీ వేసిన బంతికి స్టార్క్ బౌల్డ్ అయ్యాడు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి మరో రెండు వికెట్లు మాత్రమే మిగిలి ఉండటంతో మరో 30 నిమిషాలు మ్యాచ్‌ను కొనసాగించాల్సిందిగా టీమిండియా అనుమతి కోరింది. అయితే అప్పటికి నాథన్ లైయన్, కమిన్స్ క్రీజులో పాతుకుపోయారు. నాలుగో రోజే మూడో టెస్టును ముగించాలన్న టీమిండియా కోరికకు గండి పడింది. ఈలోపు పాట్ కమిన్స్ అర్ధ శతకం పూర్తి చేసుకొని బౌండరీల మోత మోగించాడు. దీంతో నాలుగో రోజు ఆట పూర్తయ్యే సరికి ఆసీస్ 8 వికెట్ల నష్టానికి 258పరుగులు చేసింది. పాట్ కమిన్స్(61; బ్యాటింగ్), నాథన్ లైయన్(6; బ్యాటింగ్) ప్రస్తుతం క్రీజులో ఉన్నారు.

# జగన్‌ది అధికార దాహం : మంత్రి పరిటాల సునీత

వేమూరు: దేశంలోనే అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు లభించిందని.. అటువంటి అభివృద్ధిని అడ్డుకునే వారిని ఎన్నుకుంటే రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు నష్టపోతారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి పరిటాల సునీత అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో పేదరికంపై గెలుపు - ఆదరణ-3 పథకం పనిముట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సునీత మాట్లాడుతూ అన్ని వర్గాల వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్న ముఖ్యమంత్రి ఆలోచనే ఆదరణ పథకమని అన్నారు. ఇది సంక్షేమ చరిత్రలోనే నూతన అధ్యాయంగా అభివర్ణించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేని వైసీపీ అధినేత జగన్ అధికార దాహంతో అన్నిటికీ అడ్డుపడుతున్నారని విమర్శించారు. జగన్ పార్టీ కోడి కత్తి పార్టీ అంటేనే తెలిసేటంతగా దిగజారారన్నారు. మహిళలు, యువత, రైతాంగం, ఇలా అందరికీ సాయం అందిస్తున్నది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా నక్కా ఆనందబాబు ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు.

మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ అన్ని వర్గాలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. పట్టిసీమ, పోలవరం నిర్మాణం, వ్యవసాయం, పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న చంద్రన్న ముందుచూపుతో

# గ్రామాల్లో అక్షరాస్యతపై అవగాహన



నర్సీపట్నం: నర్సీపట్నం ఏబిఎం జూనియర్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శనివారం 3వ రోజు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం మండలంలోని బుచ్చన్నపాలెం, సీతయ్య పాలెం గ్రామాల్లో అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

మధ్యలో చదువు మానేసిన వారిని కలిసి చదువు ఆపడానికి గల కారణాలు తెలుసుకొని, ఈ సందర్భంగా వారికి చదువు యొక్క ప్రయోజనాలు వివరించారు. ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ ఎ.గిరిబాబు ఈ కార్యక్రమంను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.రామకృష్ణ, పి.సత్యనారాయణల ఆధ్వర్యంలో జరిగింది.

# 31న పరవాడలో గ్రామదర్శినిని విజయవంతం చేయండి

**నాయకులు, కార్యకర్తలకు రామచంద్ర రావు పిలుపు**



పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో సోమవారం జరగబోతున్న గ్రామదర్శిని గ్రామ వికాసము కార్యక్రమం మరియు సుమారు కోటి రూపాయాలు వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు సిసి రోడ్లు, అంగన్‌వాడి భవనాలు, డ్రైనేజీ తథితర పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం జరుగుతాయని ఈ కార్యక్రమానికి స్దానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారని ,అయనతో పాటు ఎంపిపి మాసవరపు అప్పల నాయుడు, జిల్లా ప్రాదేశిక సభ్యులు పైల జగన్నాద రావు పోల్గొంటారని మండల టిడిపి ప్రదాన కార్యదర్శి పైల రామచంద్రరావు అన్నారు.

ఈ కార్యక్రమానికి మండలములో గల ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అదికార్లు తథితర్లు అధిక సంఖ్యలో పోల్గోనీ ఈ కార్యక్రమాన్ని విజయవంతము చేయాలని రామచంద్రరావు కోరారు.

# అదనపు విధుల్లో ఆ పంచాయతీ కార్యదర్శులు

**తుపాన్ సహాయక చర్యల్లో కొందరు .. సామర్లకోటలో శిక్షణలో మరికొందరు**

కొయ్యూరుః పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించిన నేపధ్యంలోనే స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమం అమలులో కొంత మేరకు నిర్లక్ష్యం జరిగిందని ఈవోపిఆర్‌డి వరలక్ష్మి తెలిపారు. మండలానికి చెందిన 12 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ పై ఈవోపిఆర్‌డి స్పందించారు. మండలంలో స్వచ్ఛ సంక్రాంతికి కేటాయించిన గత నెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పంచాయతీల్లో పారిశుధ్య పరిరక్షణ పనులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే అదే సమయంలో పెథాయ్ తుపాన్ సహాయ చర్యలు నిమిత్తం కార్యదర్శులందరూ మూడు రోజుల పాటు పాయకరావుపేట మండలానికి ప్రత్యేక డ్యూటీపై వెళ్లారని, అలాగే మరో తొమ్మిది మంది కార్యదర్శులు సామర్లకోట శిక్షణలో ఉన్నందున స్వచ్ఛ సంక్రాంతి నిర్వహణలో జాప్యం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల్లో స్వచ్ఛ సంక్రాంతి చేపట్టి పారిశుధ్య పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోపిఆర్‌డి వరలక్ష్మి తెలిపారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు నివేదించడం జరిగిందన్నారు.

# సిబ్బందికి సెలవు వలన తడి-పొడి చెత్త ఆదివారం సేకరించరు

విశాఖపట్నం: పొరుగుసేవలు సిబ్బందికి వారాంతపు సెలవు (ఆదివారం)మంజూరు చేయుటవలన సదరు పారిశుధ్య సిబ్బంది విధులకు హాజరు కానందున ప్రజలు సహకరించవలసినదిగా జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కావున నగర ప్రజలందరికి తెలియజేయునది ఏమనగా పారిశుధ్య సిబ్బంది సెలవు తీసుకొనుట వలన ఇంటివద్దకు వచ్చి తడి-పొడి చెత్త ప్రతి ఆదివారం సేకరించబడదని తెలిపారు. ఆదివారం రోజున కొద్ది మంది వర్కర్లు ఉండడం, వారు ముఖ్యమైన వాణ్య సముదాయము, కూడళ్ళు మరియు వి.ఐ.పి రోడ్లు మాత్రమే శుభ్రపరచుదురు.

కావున ప్రజలందరూ విషయాన్ని గమనించి సహకరింవచలసినదిగా కోరారు.

# డిశంబరు 30 ఆదివారం మీసేవా కేంద్రాలు తెరచి ఉంటాయి

- **31 లోగా ఆస్తిపన్ను, ఖాళీ స్దలం పన్ను వడ్డీ లేకుండా చెల్లించండి**
- **2018-19 రెండవ ఆర్ధ సంవత్సరానికి పన్నులు చెల్లించండి**
- **జివిఎంసి కమిషనర్ హరినారాయణన్**

విశాఖపట్నం: జివియంసికి చెల్లించవలసిన ఆస్తిపన్ను, ఖాళీస్దలం పన్ను వడ్డీ లేకుండా డిశంబరు 31 వ తేదివరకు చెల్లించాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. డిశంబరు 30వ తేది ఆదివారం కూడా అన్ని మీసేవ కేంద్రాలు తెరచి ఉంటాయని తెలిపారు. 2018-19 రెండవ అర్ధ సంవత్సరంనకు పన్నులు చెల్లించాలని కోరారు.

పన్ను చెల్లింపుదారులు మీసేవ కేంద్రం, జోనల్ కార్యాలయం, ఆన్‌లైన్ ద్వారా మరియు పురసేవా యాప్ ద్వారా చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

ప్రజలు ఆస్తిపన్ను, ఖాళీస్దలం పన్ను చెల్లించాలని నగర అభివృద్ధికి సహకరించాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యలమంచిలి రూరల్ః వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారం అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ప్రిన్సిపాల్ వినోద్‌బాబు తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన పోటీలలో తమ కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె.కోదండరావు, వక్తృత్వ పోటీలలో ప్రథమ స్థానం, పి.శివ వ్యాసరచన పోటీలలో ద్విదీయ స్థానం సాధించి కళాశాలకు మంచి పేరు తెచ్చారన్నార.

ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

# భవిష్యత్ వైఎస్అర్ సీపీదే

- వైసిపి సమన్వయకర్త యు వి రమణమూర్తి రాజు
- కన్నబాబు అధ్వర్యంలో వైసీపీలో పలువురు చేరిక

అచ్యుతాపురం: రాష్ట్రాన్ని గాలికొదిలేసిన చంద్రబాబును గద్దె దించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని ,భవిష్యత్ వైఎస్అర్ సీపీదే అని యలమంచిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త యువి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు .

శనివారం మండలంలో చోడపల్లి ,రామన్నపాలెం గ్రామాలలో ఆయన మాజీ డీసీసీబి చైర్మన్ యు సుకుమార్ వర్మ (తేజ) తో కలిసి రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి నవరత్నాల పతకాలను వివరిస్తు కరపత్రాలను పంపిణి చేసారు .

గ్రామాలలో మహిళలు ఈసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామని నిర్ణయించుకున్నామని భరోసా ఇస్తూ కన్నబాబుకు హారతులిస్తూ ఘనంగా స్వాగతం పలికారు .

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నను ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్న బలమైన నమ్మకం ప్రజల్లో రోజు రోజుకు పెరుగుతుందన్నారు .వైసిపిలో చేరికలు కొనసాగుతాయన్నారు .

ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం రాంబాబు ,మండల పార్టీ అధ్యక్షుడు మారిశెట్టి సూర్యనారాయణ ,నర్మాల కుమార్ ,ద్వారపురెడ్డి బాబ్జి , వడిశల శ్రీను ,మండల పార్టీ యూత్ అధ్యక్షుడు గండిబోయిన వెంకట్ ,దేశంశెట్టి శంకర్ ,లాలం వాసు ,వాసుపల్లి శ్రీనివాస రావు ,పోలవరపు పారునాయుడు ,బలిరెడ్డి శ్రీను , ఈగల అప్పలనాయుడు ,పితాని చిరంజీవి అదిక సంఖ్యలో నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు .

# 120 కేజీల గంజాయి పట్టివేత



మల్కాపురం : మల్కాపురం స్టేషన్ పరిధి శ్రీహరిపురం మాజీసైనికులకాలనీలో 102కేజీల గంజాయిని మల్కాపురం పోలీసులు పట్టుకున్నారు. జీకేవీధి నుంచి తుని తరలిస్తూ ఉంటున్న ఆరగురు సభ్యుల ముఠాను మల్కాపురం పోలీసులు పట్టుకుని వాని నుంచి 102కేజీల గంజాయి, 2కార్లు, 7సెల్‌ఫోనులు, 28180నగదును స్వాదీనం చేసుకున్నారు. నిందితులలో రమణ అనే వ్యక్తి శ్రీహరిపురంలో నివాసముంటూ, అక్రమ గంజాయి రవాణాను సాగిస్తున్నాడు. మిగిలిన 5గురు తమిళనాడుకు చెందిన వ్యక్తులు కాగా రమణతో విరికి పాత కేసులలో పరిచయం ఉందని, అంతా కలిసి గంజాయి వ్యాపారాన్ని గుట్టుగా నడుపుతూ పట్టుపడ్డారని ఏసీపీ రంగరాజన్ తెలిపారు.

# నేడు, రేపు గ్రామ వికాస్, గ్రామదర్శిని

రావికమతం: ఈ నెల 30, 31 తేదీల్లో మండలంలో గ్రామ వికాస్, గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి దంగేటి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఈ కార్యక్రమంకు హాజరవుతారన్నారు. 30న 12 పంచాయతీలలోనూ, 31న 12 పంచాయతీల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో ప్రారంభానికి సిద్దంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, సిసి రోడ్లు, తారురోడ్డు, పంచాయతీ భవనాలు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు.

# జన్మభూమి సభల షెడ్యూల్

రోలుగుంటః మండలంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి జన్మభూమి సభలు జరగనున్నాయి. ఈ మేరకు ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేశారు. ప్రతీ రోజూ వారు నాలుగు గ్రామాల చొప్పున ఉదయం ఒక గ్రామంలో, మధ్యాహ్నం మరో గ్రామంలో సభలు నిర్వహించనున్నారు. 2వ తేదీన కొమరవోలు, జానకిరాంపురం, జేపి.అగ్రహారం, కుసర్లపూడిలోనూ, 3న కొవ్వూరు, కె.నాయుడుపాలెం, బుచ్చెంపేట, శరభవరం, 4న అడ్డసరం, కంచుగుమ్మల, ఎన్.కొత్తూరు, నిండుగొండ, 5న కొంతలం, కొండపాలెం, జగ్గంపేట, గుండుబాడు, 6న ఎంకె.పట్నం, బిపి.పట్నం, రత్నంపేట, వడ్డిప, 7న రోలుగుంటలో సభలు నిర్వహించనున్నామన్నారు.

# జన్మభూమి కార్యక్రమాలను విజయవంతం చేయాలి

నాతవరంః జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు జరిగే జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరావు సూచించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెలుగు, ఉపాధి హామీ, మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికలు జరగనుండటంతో ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సంతృప్తిని వంద శాతానికి పెంచాలని ప్రభుత్వం భావించిందన్నారు. ప్రతీ రోజూ ఒక అంశంపై అధికారులు ప్రజలకు వివరిస్తారన్నారు ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజుల్లో గ్రామసభల షెడ్యూల్ ఖరారు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, వీఆర్వోలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ జిల్లా గౌడ సంఘం సామాజిక భవనం మంజూరుకు ఎమ్మెల్యే వాసుపల్లి హామీ



విశాఖపట్నం : జిల్లా గౌడ సంఘానికి సామాజిక భవనం మంజూరు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జెర్రిపోతుల ప్రసాద్, మార్గాన రామారావు వివరిస్తూ గత 48 సంవత్సరాల నుండి తమ సంఘం జగదాంబ సెంటర్‌లో అద్దె భవనంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తమకు సొంత కార్యాలయం లేదని చెప్పిన వెంటనే సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సామాజిక భవనం వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జెర్రిపోతుల ప్రసాద్, మార్గాన రామారావు గౌడ్, మార్గాన చినబాబు గౌడ్, పరీదుల శ్రీనివాసరావు గౌడ్, అత్తిలి అప్పారావు గౌడ్, దివి నారాయణరావు గౌడ్, మార్గాన విజయకుమార్ గౌడ్, ఎ.వి.ఎస్.ఎన్.మూర్తి, కేశని వెంకటేశ్వరరావు, మార్త రవిరాజు గౌడ్, అనిపెద్ది మసేను రావు గౌడ్, ఎర్నిగయిరమ్మ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ పార్టీని దహించి వేస్తున్న సీనియర్ తెలుగు తమ్ముళ్ల అసమ్మతి సెగలు



మల్కాపురం : టీ.డీ.పీకి సుధీర్ఘకాలం సేవలందించిన సీనియర్ నాయకుల నోట నేడు అస్మమతి మాటలు వినిపిస్తున్నాయి. తమకు ప్రాదాన్యం లేదని విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అస్మమతి నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ చెడ్డ పేరు వస్తుందని వాపోతున్నారు. అయితే ఇదే ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్ అయ్యింది. కారణం ఓ నాయకుడి నోట అస్మమతి మాటలు రావడమే. ఆయన ఎవరో కాదు సీనియర్ టీ.డీ.పీ నాయకుడు షేక్ మీరా. ఈ పేరు వినగానే పారిశ్రామిక ప్రాంత ప్రజలు ప్రేమగా ఎదురుచూస్తారు. కారణం ఆయన ప్రజలకు చేసిన సేవలు. తోటివారికి సాయం చేయ్యడంలోనే నిజమైన ఆనందం ఉందని నమ్మే వ్యక్తి ఆయన. 47వ వార్డుకు చెందిన షేక్ మీరా చిన్నతనం నుండే సేవాకార్యక్రమాలపై మక్కువ చూపి పారిశ్రామిక ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ నేటి వరకు ప్రజల మనసుల్లో సుస్థిర స్దానం సంపాదించుకున్నాడు. 1983లో కోళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో టీ.డీ.పీలో చేరిన ఆయన నాటా నుండి నేటి వరకు ఇదే పార్టీలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అయితే పార్టీ కోసం ఇంత చేసిన వ్యక్తి ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నాడు. కారణం పార్టీలో తనకి తగిన గుర్తింపు లేకపోవడమే. షేక్‌మీరా రాజకీయ ప్రస్తానం టీ.డీ.పీలో ఏళ్లు గడుస్తున్న పార్టీ నాయకుల తీరు వల్ల ప్రస్తుతం ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు పార్టీ పెద్దలు ప్రాదాన్యమిస్తూ తనను, తన వర్గం వారిని పెడచెవిన పెటిందని వాపోతున్నారు. తన సొంత డబ్బులు ఖర్చు చేసి మరీ పార్టీ బలోపేతానికి కృషి చేసిన తనకు పార్టీలో గుర్తింపు లేదని అతని వాదన. సాధురావు లాంటి నాయకులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి పెంచి పోషిస్తున్న టి.డీ.పీ ప్రభుత్వం తనలా నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన నాయకుడిని మరచి పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వేరే పార్టీ వారు ఆహ్వానిస్తున్న నమ్ముకున్న పార్టీని వదిలివెళ్లడం ఇష్టంలేని మీరా ప్రజలకు సేవ చేయ్యడం కోసం తాను ఎన్ని రోజులైనా ఎదురుచూస్తుంటానని అన్నారు. పార్టీ నన్ను గుర్తించక పోయిన ఒక సోషల్‌వర్కర్‌గా నా దృషికి వచ్చిన సమస్యలను అధికారుల దృషికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారదిశగా నిస్వార్దంగా పనిచేస్తానని అన్నారు.

# ఘనంగా గ్యార్వి షరిఫ్ వేడుకలు



కంచరపాలెం: జీవీఎంసీ 40 వ వార్డు పరిది డాక్టర్ జాకీర్ హుస్సేన్ లో గ్యార్వి షరిఫ్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా కొలని వద్ద నున్న హజ్రత్ గౌస్ పాక్ నిషాని వద్ద పెద్ద ఎత్తున్న ముస్లిం సోదరులు ఫాతిహా నిర్వహించారు. ఈ మేరకు గ్యార్వి షరిఫ్ వేడుకలను పురస్కరించుకొని చిన్నారులు నాతే ఖలం లు ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన్న మౌలనలు (ముస్లిం మత పెద్దలు) తక్రిర్ పఠించారు. ఖురాన్ లో సూక్తులు, ఇస్లాం గురించి స్థానిక ముస్లిం సోదరులకు వివరించారు.కార్యక్రమాన్ని ఉర్స్ కమిటీ అద్యక్షులు షేక్ నూరి, కార్యదర్శి సుభానీ ( సోనీ ) పర్యవేక్షించారు. కార్యక్రమంలో మస్జిద్ -ఈ -అల్ ఖాదిర్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

# అదుపు తప్పి ఢీ కొట్టిన కారు



అరకులోయ : అరకులోయ సినిమ హాల్ గడ్డ వద్ద నర్సీపట్నం, విజయనగరానికి చెందిన పురోషోత్తం నవ్యతేజల కారు అదుపు తప్పి వంతెన గోడను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలతో కెజిహెచ్‌కి తరలించారు.

# కలుషిత నీళ్లు తాగి 30 మేకలు మృతి

- 50 మేకలు పరిస్థితి విషమం
- వంతువానిపాలెంలో విషాదం



దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయితీ శివారు వంటివానిపాలెంలో కలుషిత నీరు తాగి 30 మేకలు మృతి చెందాయి .మరో 50 మేకలు పరిస్థితి విషమంగా ఉన్నాయి .ఈ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది .బాధితుల కధనం ప్రకారం వివరాలులిలాఉన్నాయి .ఈ గ్రామనికి చెందిన వంటి సన్యాసి నాయుడు, కె .సింహాద్రి ,వి .సన్యాసిరావు, బి .గురువులు ,కె .గురువు నాయుడు, ఎస్ .రామతీర్ధం కు 200 మేకలు ఉన్నాయి . వీరు వీటినే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్నామని తెలిపారు. పక్కనే ఉన్న కొండపై మేకలు తోలుకొని వెళ్లగా అక్కడ గుంతలో నీళ్ళు తగిన మేకలు చనిపోయాయి .మరొ 50 మేకల పరిస్థితి దారుణంగా ఉందని బాధితులు లబోదిబో మంటున్నారు. దీనిపై రెవెన్యూ ఆధికారులు దర్యాప్తు చేస్తున్నారు.




# విజయభాను

## సంపాదకీయం

### అక్రమాలతోనే ప్రమాదాలు

మేఘాలయలో బొగ్గుగని ప్రమాదం దేశంలో పేరుకుపోయిన అవినీతికి, విధాన రాహిత్యానికి అద్దం పడుతున్నది. జాంటియా కొండ ప్రాంతంలో అక్రమంగా తవ్వుతున్న బొగ్గు గని బొయ్యారంలో దాదాపు పదిహేను మంది పేద కూలీలు ఈ నెల 13న చిక్కుకుపోయారు. వారిని బయటకు తీయడానికి ఇంకా ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విప త్తు నిర్వహణ బృందంతో సాధ్యం కాకపోవడంతో, శుక్రవారం నావికాదళ బృందాన్ని రంగంలోకి దింపారు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప బొయ్యారంలో చిక్కుకుపోయిన వారు బతికి ఉండే అవకాశాలు దాదాపుగా లేవు. కూలీలు దాదాపు 70 అడుగుల లోతులో ఉన్నారు. అంత లోతులోకి వెళ్ళి కాపాడే శక్తి సామర్థ్యాలు విపత్తు నిర్వహణ సిబ్బందికి లేవని అంటున్నారు. అందులోకి నీటి ప్రవాహం సాగుతూనే ఉన్నది. వాటిని తోడివేయడానికి అవసరమైన శక్తిమంతమైన పంపులను ఇప్పుడిప్పుడే అమరుస్తున్నారు. ప్రమాదం జరిగి రెండు వారాలైంది. వారిని బయటకు తీసే సామర్థ్యం లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం ఏమి చేసిందనే ప్రశ్న తలెత్తుతున్నది. వెంటనే కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు కోరితే సహాయ చర్యలు ఇంకా వేగంగా సాగేవి. కానీ సాధ్యమైనంత వరకు ఈ ఘటన ప్రచారం పొందకుండా జాగ్రత్త పడాలనే రాష్ట్ర ప్రభుత్వం భావించింది. జాంటియా కొండ ప్రాంతంలో అక్రమంగా గనుల తవ్వకం సాగుతుండటం, ప్రమాదం జరిగిన తరువాత కొద్దిరోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనిస్తే మన దేశంలో చట్టబద్ధ పాలన సాగుతున్నదా లేక ముఠాల శాసనమే అమలవుతున్నదా అనే అనుమానం కలుగుతుంది. ఈ గని ప్రమాదం దేశవ్యాప్తంగా ప్రచారం పొందడంతో, మేఘాలయలో అక్రమంగా గనుల తవ్వకం సాగుతున్నదని ముఖ్యమంత్రి కొన్రాడ్ సంగ్మా బహిరంగంగా అంగీకరించక తప్పలేదు. జాంటియా కొండల ప్రాంతంలో భారీ బొగ్గు నిక్షేపాలున్నాయి. వీటిని తవ్వడానికి ప్రైవేటు సంస్థ లు పెద్ద ఎత్తున రంగంలోకి దిగాయి. ఈ సంస్థలు అనేక పర్యావరణానికి హాని కలిగించడమే కాకుం డా, అనేక అశాస్త్రీయ, అక్రమ విధానాలను అవలంబిస్తున్నాయి. బొగ్గు సొరంగాల తవ్వకానికి బాలలను ఉపయోగిస్తున్నాయి. దాదాపు 70 వేల మంది బాలలు వీటిలో పనిచేస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ ఆరోపించింది. కానీ తమ తనిఖీలో 222 మంది మాత్రమే పిల్లలు ఉన్నట్టు బయటపడ్డదని ప్రభుత్వం పేర్కొన్నది. ఈ తవ్వకాల మూలంగా పర్యావరణం దెబ్బతింటున్నది. అక్కడి నదీ జలాలు కూడా కలుషితం అవుతున్నాయి. ప్రజలకు మంచినీరు లభించడం లేదు. దీంతో ఈ తవ్వకాలను నిలిపివేయాలంటూ అస్సాంలోని ఒక సంస్థ హరిత ట్రిబునల్‌లో పిటిషన్ వేసింది. దీంతో హరి త న్యాయస్థానం 2014 ఏప్రిల్‌లో గనుల తవ్వకంపై నిషేధం విధించింది. నిషేధం విధించిన తరువాత అక్రమ తవ్వకాలు భారీగా పెరిగిపోయాయి. ఈ తవ్వకాలు కూడా ప్రమాదకరమైన రీతిలో సాగుతున్నాయి. కొండ పాదం దగ్గర అడ్డంగా బొయ్యారాలు తవ్వుతారు. బొగ్గు లభించిన చోట పక్కలకు సొరంగాలు తవ్వు తూ బొగ్గును బయటకు తెస్తారు. ఈ బొయ్యారాలు మనిషి అంబాడితే తప్ప వెళ్ళలేనంత చిన్నగా ఉంటాయి. అందుకే వీటికి పిల్లలను వాడుకుంటున్నారు. ప్రమాదాలలో కూలీలు మరణిస్తే ఆ వార్త బయటకు పొక్కనీయరు. ఇప్పటి వరకు రెండు మూడు ప్రమాదాలు మాత్రమే జాతీయస్థాయిలో ప్రచారం పొందాయి. క్సన్ అనే ప్రాంతలో జరిగిన తాజా ప్రమాదాన్ని కూడా చాలారోజుల వరకు కప్పిపుచ్చే ప్రయత్నం జరిగింది. అక్రమ బొగ్గు గనుల తవ్వకం వల్ల జరుగుతున్న నష్టం లెక్కలకు అందనిది. కొన్ని వందల కోట్ల రూపాయల మేర సాగుతున్న ఈ అక్రమ వ్యాపారం వల్ల, ప్రైవేటు ముఠాలు ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయి. రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులు, తీవ్రవాదలు మొదలైన భిన్నవర్గాల వారు గనుల ముఠాల ఎంగిలి మెతుకులకు అలవాటుపడ్డారు. అక్రమ గనుల యజమానులకు చెందిన గూండాలు బెదిరించడం వల్ల తాజా ప్రమాదం గురించి స్థానికులు తమకు సమాచారం అందించలేదని ప్రభుత్వ అధికారులు అన్నారంటే, అక్కడ ప్రభుత్వమనేది లేదని తెలిసిపోతున్నది. అక్రమ వ్యాపారం మొత్తం సామాజిక జీవనాన్ని, పాలకవ్యవస్థను నిర్వీర్యం చేసింది. అక్రమ తవ్వకాల ఫొటోలు తీసిన ఒక స్వచ్ఛంద సంస్థ కార్యకర్తపై దాడి జరిగిందంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మేఘాలయలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వమే ఉన్నది. జాతీయపార్టీ అధికారంలో ఉండి కూడా పరిపాలనారంగంలో తేడా కనిపించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకొని గనుల్లో చిక్కుపోయిన వారిని బయట కు తీయించాలె. దీంతో పాటు అక్రమ గనుల తవ్వకాన్ని పూర్తిగా అరికట్టాలె. పర్యావరణానికి హాని కలుగకుండా, గనుల తవ్వకాన్ని సాగించవచ్చా అనేది పరిశీలించాలె.

## అమెరికాలో భారీగా మంచు: ముగ్గురి మృతి



షికాగో : అమెరికాలో భారీగా కురుస్తున్న మంచు, ఈదురు గాలుల వల్ల ముగ్గురు మృతి చెందారు. మంచు కారణంగా గత కొన్ని రోజులుగా పాఠశాల లకు, కార్యాలయాలకు అన్నింటికి సెలవులు ప్రకటించారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల నుకున్న వారికి నిరాశే ఎదుర య్యింది. మంచు విపరీతంగా కురుస్తుండడంతో దాదాపు 500 విమానాలను రద్దు చేసినట్లు విమానాయన శాఖ తెలిపింది. 5,700 విమాన సర్వీసులను ఆలస్యంగా నడుపుతున్నట్లు ప్రకటించింది.అమెరికాలోని రోడ్లు, విమానాశ్రయాలు అన్ని కూడా దాదాపు 20 నుంచి 30 సెంటిమీటర్ల ఎత్తు మేర మంచుతో కప్పబడి ఉన్నాయి. నూతన సంవత్సర వేడు కలు సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రణాళికలు వేసుకున్న వారందరూ విమానాలు రద్దు అవ్వడంతో నిరాశకు గురయ్యారు. మంచు భారీగా కురుస్తుండడంతో 6,500 విమానాలు ఆలస్యంగా నడిచాయి. 800 పైగా విమానాలు రద్దయ్యాయి. పరిస్థితి కొంచెం మెరుగు పడింది. అయినప్పటికీ కొన్ని విమాన సర్వీసులను పునరుద్ధరించక పోవడంతో ప్రయాణికులు రోజుల తరబడి విమానా శ్రయాలలో వేచి ఉన్నారు. అధికారులు రోడ్లపై పేరుకు పోయిన మంచును తొల గిస్తున్నారు.

## 30 లక్షల మందితో ఉమెన్స్ వాల్



తిరువనంతపురం: సాంస్కృతిక పునరుజ్జీవ విలువలను కాపాడుకునే ఉద్దేశంతో కేరళలో జనవరి 1న దాదాపు 30 లక్షల మంది మహిళలతో ఉమెన్స్ వాల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సుమారు 620 కిలోమీటర్ల మేర ఉండనున్న ఈ ప్రదర్శనను పలు స్వచ్ఛంద సంస్థల సాయంతో కేరళ ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు వార్డు, నియోజక వర్గ, జిల్లా స్థాయుల్లో సమావేశాలు జరుపుతున్నారు. ఇందు కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఎవరెవరు ఏయే ప్రాంతంలో పాల్గొనాలనే విషయంపై చర్చిస్తున్నారు. మహిళలపై కొన సాగుతున్న వివక్షకు వ్యతిరేకంగా దీన్ని నిర్వహిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు ఇందుకోసం ముందుకు వచ్చాయి. దీనికోసం ప్రభుత్వ నిధులను ఖర్చు చేయట్లేదు అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. తిరువ నంతపురం నుంచి మూడు లక్షల మంది మహిళలు ఇందులో పాల్గొం టారు. కొన్ని ప్రాంతాల మీదుగా 43.5 కిలోమీటర్ల మేర వీరి మానవహారం ఉం టుంది. వారిని కలుపుతూ అలప్పుజ నుంచి నాలుగు లక్షల మంది 97 కి.మీ మానవహారం నిర్వహిస్తారు. అలాగే, కోజికోడ్ జిల్లాలో మూడు లక్షల మంది, కన్నూర్‌లో ఐదు లక్షలు, మలప్పు రం నుంచి 1.80 లక్షలు, ఇడుక్కి నుంచి 45,000 మంది ఈ మానవహారంలో పాల్గొంటారు. ఆ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా లక్షలాది మహిళలు ఇందులో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో మొదటి సభ్యురాలిగా ఆ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఎంసీ జోసెఫైన్ పాల్గొంటారు.

## మన్మోహన్‌తో కేక్ కటింగ్: రాహుల్‌కు ప్రశంసలు



దిల్లీ: కాంగ్రెస్ పార్టీ 134వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్(86)తో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే సీనియర్ నాయకుల సమక్షంలో పార్టీ జెండాను ఎగర వేశారు. అయితే మన్మో హన్‌తో సహ రాహుల్ కేక్ కట్ చేసిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

కటింగ్ అనంతరం చిన్న కేక్ ముక్కను తీసుకొని మొదట ఆయనకు పెట్టడం గౌరవానికి చిహ్నంగా కనిపించింది. ఇదే రోజు కాంగ్రెస్ ఎంపీ ఏకే ఆంటోని పుట్టినరోజు కూడా ఉండటంతో పార్టీ కార్యా లయంలో మరో కేక్‌ను కట్ చేశారు. ఈ ఫొటోలను ఆ పార్టీ నాయకుడు శశిథరూర్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. వాటికి నెటిజన్లను నుంచి మంచి స్పందన వచ్చింది. ఒకవైపు బాలీవుడ్ ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రలో నటించిన ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ ట్రైలర్‌పై వివాదం చెలరేగుతుంటే మరోవైపు ఈ ఆత్మీయ సంఘటన జరిగింది. 2004-08 మధ్య మన్మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్‌బారు రాసిన పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు.

## మీ అహంకారంతోనే కూటమి కూలుతోంది



పట్నా: ఎన్డీయే కూటమిలోని నేతల అహంకారం కారణంగానే ఒక్కోపార్టీ కూటమి నుంచి బయటకు వస్తోందని బిహార్ ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అన్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, బిహార్ సీఎం నితీష్ కుమార్‌ల వ్యవహారం సొంతపార్టీ నేతలకే నచ్చడంలేదని, వారి తీరుపై ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. మాజీ కేంద్ర మంత్రి ఆర్ఎల్ఎస్పీ అధినేత ఉపేంద్ర కుష్వాహా నిర్ణయమే దానికి నిదర్శనమని తేజస్వీ పేర్కొన్నారు. కుష్వాహా ఇటీవల ఎన్డీయే నుంచి బయటకు వచ్చి యూపీఏ కూటమిలో చేరిన విషయం తెలిసిందే.త్వరలోనే మరికొన్నిపార్టీలు కూడా వారికిదూరమవ్వడం కాయమని తేజస్వీ అభి ప్రాయపడ్డారు. పట్నాలో ఆయన మీడియాతో మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయ డలో బీజేపీ, జేడీయూ విఫలమయ్యాయని మండి పడ్డారు. ఇక జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయకాబోయ్యే కూటమి గురించి ఆయన కూడా తేజస్వీ వివరించారు. ప్రస్తుతం తమ దృష్టింతా ప్రజల పక్షాన పోరాటమేనని, కూటమి అది కారంలోకి వస్తే ప్రధాని ఎవరనే చర్చ ఇప్పుడు అనవసర మన్నారు. బీజేపీకి అధికారం అప్పగించి ప్రజలంతా బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు.

## సమయం

### 'లేవండి... మేల్కొనండి...'

జాతిని మేల్కొల్పి
జన్మించి
మనిషికి మూఢ విశ్వాసం
ప్రభల శత్రువని
మనసుని బలహీనపరచే
వినాశనకారి అని తెల్పి
వీటిని అధిగమింప
దివ్య ఉపనిషత్తులను
ఆశ్రయించమని
ప్రభోధించి
స్పందించే హృదయం
ఆలోచించే మెదడు
సహాయ పడే గుణం
యువతకు ప్రధమ లక్షణమని
ఓ... నా ధీర వత్సలారా...
లేవండి... మేల్కొనండి...
మహత్కార్యాలు సాధించడానికే
మనం జన్మించామని
యువకులను సంఘటిత పరచడానికి
తాను జన్మించానని
ఎలుగెత్తి చెప్పిన
మార్గదర్శకుడు
వివేకానందుడు.

...రచయిత
ఆర్.శంకర్
సెల్ నెం:9849213779

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : అష్టమి ఉ.7.06; నవమి రా.తె.5.39; హస్త మ.1.07; రా.వ.8.50ల 10.23.

ఆదివారం 30-12 -2018

**మేషం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. పెద్దల సల హాను పాటించండి మీ గౌరవాన్ని నిలబెట్టుకుంటారు. రాబడికి మించిన ఖర్చులు తప్పనిసరి చెల్లింపులు వల్ల ఆటుపోట్లు తప్పవు. మీ సంతానం ఉన్నత విద్యల కోసం కొత్తకొత్త ప్రణాళికలు రూపొందిస్తారు. అవివాహితుల్లో నూత నోత్సాహం చోటుచేసుకుంటుంది. **వృషభం:** ఆర్థిక లావాదేవీలు, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఇతరుల ముందు వ్యక్తిగత విషయాలు వెల్లడించడం మంచిది కాదని గమనించండి. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. విద్యార్థుల మొండివైఖరి ఎంతో చికాకు కలిగిస్తుంది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది. **మిథునం** : ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వాహనం నడుపునపుడు మెళకువ అవ సరం. బంధుమిత్రులతో సఖ్యత నెలకొంటుంది. స్త్రీలకు ఆరోగ్యపరమైన సమ స్యలు తలెత్తుతాయి. ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు వాయిదా పడతాయి. రాజకీయ నాయకుల పర్యటనల్లో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. **కర్కాటకం** : ప్రేమికుల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తుతాయి. ప్రయాణాలు చికాకు పరుస్తాయి. కొబ్బరి పండ్లు, పూల నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు కలిసిరాగలదు. హుందాగా మెలిగి అందరినీ ఆకట్టుకుంటారు. బంధువులతో సంబంధాలు మెరుగుపడతాయి. విద్యా సంస్థలలోని ఉపాధ్యా యులకు ఒత్తిడి అధికంగా ఉంటుంది. **సింహం** : ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల కలయిక సాధ్యం కాదు. ఆహార వ్యవహారాల్లో మెలకువ వహించండి. అపరిచిత వ్యక్తులు తప్పుదారి పట్టించేం దుకు యత్నిస్తారు జాగ్రత్త వహించండి. మీ ప్రమేయం లేకున్నా మాటపడవలసి వస్తుంది. వైద్య రంగాల వారికి అన్ని విధాల కలిసిరాగలదు. **కన్య** : ఉపాధ్యా యులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. అనుకోకుండా పాత బాకీలు వసూలవుతాయి. వ్యాపారాల్లో కొత్తకొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. బంధువుల నుంచి సమస్యలు తలెత్తుతాయి. స్త్రీలకు అయిన వారి నుంచి ఒక ముఖ్య సమాచారం అందుతుంది. **తుల** : హుందాగా మెలిగి అందరినీ ఆకట్టుకుంటారు. విద్యా సంస్థలోని వారికి ఒత్తిడి, తిప్పట అధికం. నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సహం లభిస్తుంది. విదేశాల్లోని అభిమానుల క్షేమసమాచారం ఆందోళన కలిగిస్తుంది. విద్యార్థులకు ఒత్తిడి, విశ్రాంతి లోపం వంటి చికాకులు ఎదురవుతాయి. **వృశ్చికం** :కుటుంబీకులతో కలిసి విందు వినోదాల్లో పాల్గొంటారు. చెల్లింపులు, చెక్కుల జారీలో జాగ్రత్త. దంపతుల మధ్య అకారణకలహం, చికాకులు తలెత్తుతాయి. ప్రియతములతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ బాధ్యతల్లో తప్పిదాలు దొర్లే సూచనలు ఉన్నాయి. దళారులు, బోగస్ సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలి. **ధనుస్సు** : స్త్రీలకు తల కళ్లు నరాలకు సంబంధించిన చికాకులు అధిక మవుతాయి. కోర్టు వాజ్యాలు ఉపసంహరించుకుంటారు. మీ అతిథి మర్యాదలు అందరినీ సంతృప్తిపరుస్తాయి. నిరుద్యోగులకు ఉపాధి పథకాల్లో క్రమంగా నిలదొక్కు కుంటారు. చిన్ననాటి పరిచయస్తులను కలుసుకుంటారు. ఉమ్మడి వెంచర్లు, లీజు, ఏజెన్సీలకు అనుకూలం. చిన్నతరహా పరిశ్రమలలో వారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. క్రయ విక్రయాలు సామాన్యం. **మకరం** : సహోద్యోగుల సాయంతో ఒక సమస్య నుంచి బయటపడతారు. రుణాల కోసం అన్వేషిస్తారు. స్త్రీలకు నరాలు, కళ్లు దంతాలకు సంబంధించిన సమస్య లెదురవు తాయి. మీ సంతానం మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. ఆలయాలను సందర్శిస్తారు. **కుంభం** : కుటుంబ ఆర్థిక విషయాలు గోప్యంగా ఉంచండి. పొదుపు చేయాలన్న ఆలోచన ఫలించదు. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి. బ్యాంకు పనుల్లో జాప్యం వల్ల ఇబ్బందులెదుర్కొంటారు. దూర ప్రయాణాలు అను కూలిస్తాయి. స్వర్ణకారులు, బంగారు వ్యాపారులకు పని వారలతో చికాకులు తప్పవు. **మీనం** : గృహంలో ప్రశాంతత నెల కొంటుంది. రోజువారీ ఖర్చులే ఉంటాయి. పొదుపు పథకాలపై దృష్టిసారిస్తారు. సంబంధాలు, పరి చయాలు బలపడతాయి. పనులు నెమ్మదించినా అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం క్షేమం కాదు. సంతానం చదువుల పట్ల మరింత శ్రద్ధ వహించాలి.

## ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించు కోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగ న్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయ పురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

## చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.




## నాదెండ్ల మనోహర్‌ను కలిసిన సర్వసిద్ధి



పరవాడ: జనసేన ఆత్మీయ సమావేశంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్, రాష్ట్ర జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ ను యాభై అరోవవార్డు జనసైనికుడు సర్వసిద్ధి సన్యాశిరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛముఅంద జేశారు. అనంతరము అయన నియోజకవర్గంలో గల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు.

## జనసేన క్యాలండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్ బయపురెడ్డి తదితరులు

నర్సీపట్నం : జనసేన పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జనసేన పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా (సోషల్ జస్టిస్ విభాగం) అశోక్ బయపురెడ్డి శనివారం నర్సీపట్నంలో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా నర్సీపట్నం మార్కెట్‌లో ప్రతి దుకాణానికి, షాపులకు వెళ్లి ఈ క్యాలెండర్లను పంపిణీ చేశారు. అనంతరం జన సేన మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా అశోక్ బయపు రెడ్డి మాట్లాడుతూ జనసేనకు అన్ని వర్గాలు ప్రజలు నుండి ఆదరణ వస్తుందన్నారు. జనసేన ఎన్నికల గుర్తు గాజు గ్లాస్‌ను అని తెలిపారు. రానున్న రోజుల్లో పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అవడం ఖాయమని, దీని కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

## 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి

### మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్



విజయనగరం : రానున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని మున్సిపల్ కమిషనర్ టి.వేణు గోపాల్ అన్నారు. పురపాలక పరిధిలో 10/10 మార్కులను ఎక్కువమంది విద్యార్థులు సాధిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులకు కంటోన్మెంట్ పురపాలక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను కమిషనర్ టి.వేణు గోపాల్ శనివారం సాయంత్రం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ విద్యార్థులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా సిద్ధం కావాలని సూచించారు. సాదారణంగా పాఠశాలల్లో పరీక్షలకు ఏవిధంగా హాజరవుతారో అదేవిధంగా పబ్లిక్ పరీక్షలకు కూడా ఎలాంటి ఒత్తిడి లేకుండా హాజరుకావాలన్నారు. 10వ తరగతి పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున సమయాన్ని వృధా చేయకుండా చదువుపై మాత్రమే దృష్టిపెట్టాలని సూచించారు. ఇతర అంశాలకు ప్రాధాన్యత తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవి ష్యత్‌కు 10వ తరగతి పరీక్షా ఫలితాలు పునాదిలాంటి వన్నారు. ఈ కార్యక్రమంలోపలువురుఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామనారాయణంలో గోపూజోత్సవం



విజయనగరం : ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామ నారాయణంలో గోపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారంలక్ష్మీదేవి తిరునక్షత్రం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని సుస్వర వేదమంత్రాల నడుమ దేవాలయం ప్రధాన అర్చకులు చాణక్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, రామనారాయణం సిఈఓ టిఎల్ఎన్ మూర్తి, పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరాజు,ఎం వి రమణ, భక్తులు పాల్గొన్నారు.

## మంత్రి హత్యపై కుట్ర అంటూ వైరల్ చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోరా

### మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం : ఏపీ సీనియర్ మంత్రి చింత కాయల అయ్యన్న పాత్రుడు పై హత్యాయత్నం అంటూ వైరల్ అయిన వీడియో బాధ్యుల పై చర్యలు తీసుకోవా లని ఫిర్యాదు చేసి నెల రోజులు అయినా విచారణలో పోలీసుల జాప్యం పట్ల నర్సీపట్నం మున్సి పల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు మండిపడ్డారు. శనివారం నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ క్యాబినెట్‌లో సీనియర్ మంత్రి ప్రాణాలకు విలువ లేదా, వీడియో సృష్టి వెనుక పెద్దల హస్తం ఏదైనా ఉందా ...అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఏదో అదృశ్య శక్తి పని చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.సీసీ పుటేజీలు బయటకు విడుదల చేసిన ఫంక్షన్ హాల్ యాజమాన్యాన్ని ఎందుకు విచారించడం లేదని, పోలీసుల పై ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈ వార్త ప్రసారం చేసిన రెండు ఛానళ్లకు కోర్టు నోటీసులు ఇచ్చామని, యాజమాన్యం స్పందించక పోతే పరువు నష్టం దావా వేస్తామన్న చెప్పారు. ఇప్పటికైనా పోలీసులు విచారణ వేగంగా నిర్వహించకపోతే న్యాయ పోరాటం చేయడంతో పాటు, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



విజయనగరం : పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే ధ్యేయంగా అధికారులు, కౌన్సిలర్లు పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. పనుల వేగవంతంలో భాగంగా పురపాలక చరిత్రలో మొదటిసారి 182 అంశాల అజెండాతో పురపాలక సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. శనివారం పురపాలక సమావేశ మందిరంలో పురపాలక కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 181 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో డిప్లమో అప్రెంటిస్, టిపిబిఓల సేవలను మరో సంవత్సరం పొడిగించుటకు కౌన్సిల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు వారి వార్డు పరిధిలో సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసు కుంటున్నా మన్నారు. ప్రతీ వార్డుకు అదనంగా మంజూరు చేసిన కోటి రూపాయల నిధులతో చేపట్టబోయే పనులను వేగంగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో వన్ మెగావాట్ సోలార్ వ్యవస్థను అదనంగా ఏర్పాటు చేస్తున్నా మన్నారు. అలాగే ప్రతీవార్డులో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే నాలుగు ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఆర్‌ఓ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కమిషన్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ పనులను వేగవంతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల న్నింటినీ త్వరగా పూర్తిచేసి, కొత్తగా మంజూరైన పనులను జనవరి మొదటివారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు. జనవరి 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు జరిగే జన్మభూమి, మావూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌన్సిలర్లకు, అధికారు లకు సూచించారు. జన్మభూమి, మావూరు కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం

అరకులోయ : అరకు పర్యటక ప్రాంతంలో పర్యాటకులు డిశంబర్ 31 న విందు చిందులు తదితర అసాంఘిక కార్యకలాపాలకు చట్ట పరమైన చర్యలు పాడేరు డి.ఎస్.పి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అరకులోయ సబ్ ఇనిస్పెక్టర్ పత్రిక ప్రకటన ద్వార విలేకరులకు తెలిపారు. పర్యాటకులు రాత్రి 1 గంట తర్వాత రోడ్డు మీద గొడవలు చేస్తు తిరిగితే చట్ట పరమైన చర్యలు తీసుకొనబడును మద్యం సేవించి వాహనాలు నడిపిన యెడల కేసు నమోదు చెయ్యబడును లాడ్జి రిసార్ట్స లలో మరి ఎక్కడైనా అసాంఘిక కార్య కలాపాలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకొనబడును శాంతి భద్రతలకి విఘాతం కలగకుండా ఉండుటకు ప్రత్యేక బ్రుంధాలు గస్తీ తిరిగును ప్రతి సంవత్సరం న్యూ ఇయర్ వేడుకలో రోడ్డు ప్రమాదాలు జరిగి చాల మరణించడం పత్రికలో చూస్తున్న విషయమే కాబట్టి ఎటువంటి కార్య కలాపాలు చేసుకోవాలన్న పాడేరు డి.ఎస్.పి అనుమతి పొందాలి అన్నారు అలగే నూతన సంవత్సరం వేడుకలు అందరు బాధ్యతగా జాగ్రత్తలు తీసుకుంటూ వేడుకలు జరుపుకోవాలి అని పాడేరు డి.ఎస్.పి ఆదేశాలమెరకు పత్రికల వారికి తెలిపారు.

## 48వవార్డులో సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన



మల్కాపురం : జీవీఎంసీ 48వ వార్డు రెడ్డివీధిలో శనివారం సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జీవీఎంసీ వర్క్స్ ఏఈ మణికుమార్, వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేష్ చేతుల మీదుగా ప్రారంబించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీ.డీ.పీ పాలన వల్ల 40 ఏళ్ళలో జరగని అబి వృద్ధి జరుగుందని, ఈ ఘనత అంతా టీ.డీ.పీ పార్టీకే దక్కుతుందని అన్నారు. స్దానిక ఎమ్మెల్యే గణబాబు చొరవతో సామాజిక భవనం నిర్మాణం జరుగుందని, మహిళంతా ఎమ్మెల్యేకు దన్య వాదాలు తెలిపారు.

అలాగే మజ్జి సోమేష& ఆధ్వర్యంలో 48వ వార్డు నగరాల వీదిలో శ్రీనివాస కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. తిరుపతి నుంచి వచ్చిన వేద పండితులు శాస్త్రోతంగా కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్య క్రమంలో కాకిపోలిరెడ్డి, వర్క్స్ ఇన్సిపెక్టర్ రమేష్, పిల్లా జయంత్, నీలాపు జోగిబాబు, బర్ల కనకరాజు, నర్సింగరావు, ఊరుకూటి పైడిరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని సాధించేంత వరకు విశ్రమించవద్దు

### జిల్లా ఎస్పీ జి.పాలరాజు



విజయనగరం : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాలనుసాధించేందుకుగాను ఏర్పాటు చేసిన శారీరక మరియు వ్రాత పరీక్ష శిక్షణను జిల్లా ఎస్పీ జి. పాలరాజు సారిపల్లి ఉన్న జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. పాలరాజు మాట్లాడుతూ - ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతను ఎంపిక చేసి, పోలీసు ఉద్యోగాలసాధనే లక్ష్యంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు ఎంపికైన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని, లక్ష్యాని సాధించేంత వరకు ఎవ్వరూ విశ్రమించ వద్దని పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో ఎస్‌ఐలుగా, కానిస్టేబుళ్ళుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారే ఎక్కువగా ఎంపికవుతున్నారని, అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవా లన్నారు. మధ్య తరగతి కంటే దిగువున ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులను లక్ష్యంగా చేసుకొని, సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంటు లయద ఎంటర్‌ప్రన్యూర్ డెవలప్‌మెంట్ సహకారంతో శిక్షణను ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ శిక్షణకు ఎంపికవ్వడం ద్వారా పోలీసుల ఉద్యో గాల సాధనలో ముందడుగు వేసారన్నారు. పోలీసు ఉద్యోగాల ఎంపికప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, ప్రలోభాలకు లొంగవద్దని, ప్రతిభకు మాత్రమే పట్టం కడతామని, లక్ష్య సాధన దిశగా కోరికలను మార్చుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాలు సాధించకుండానే పోలీసు శిక్షణ ఏవిధంగా ఉం టుందో, క్రమశిక్షణకు పోలీసుశాఖ ఎంత ప్రాధాన్యత కల్పిస్తారన్న విషయం ఈ శిక్షణ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ఏ ఇతర జిల్లాలో ఇటువంటి శిక్షణను పోలీసుశాఖ చేపట్టలేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎక్కువ మంది పోలీసు కానిస్టేబుళ్ళుగా ఎంపికవ్వాలన్నారు.ఒఎస్‌డి జె. రామమోహన రావు మాట్లాడుతూ ఎస్పీగారి ప్రత్యేక శ్రద్ధతో, ప్రభుత్వ సహకారంతో పోలీసుఉద్యోగాల సాధనే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని వర్గాల యువతీ, యువకులకు ప్రాథమికం శారీరక, వ్రాత పరీక్షలను నిర్వహించి, శిక్షణకు ఎంపిక చేసామన్నారు. 250మంది యువతీ, యువకులకు రెండు మాసాల పాటు శిక్షణ ఇస్తున్నట్లు, శిక్షణ సమయంలో భోజన, వసతులను కల్పిస్తున్నామన్నారు. డిఆర్‌డిఎ అదనపు ప్రాజెక్టు అధికారి వి.డి.ఆర్. ప్రసాద్ సీడ్‌ఎపి మేనేజరు విజయకుమార్ అనంతరం, వైదేహి స్టడీ సర్కిల్ ఫ్యాకల్టీ షణ్ముక రావు, సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొం దించినస్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించి, శిక్షణకు అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె. రామ్మోహన రావు, విజయనగరం డిఎస్పీ డి. సూర్య శ్రావణ్ కుమార్, డిటిసి ఇన్‌చార్జ్ డిఎస్పీ టి. త్రినాధ్, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, సీడ్ ఎపి మెషిన్ మేనేజరువిజయ్ కుమార్, డిఆర్‌డిఎ అదనపు ప్రాజెక్టు అధికారి వి.డి.ఆర్. ప్రసాద్, జె.ఎం.డి. బి. శ్రీనివాసరావు, సిఐలు జి. రామకృష్ణ, రమేష్, ఆర్‌ఐలు రామకృష్ణ, రమేష్ కుమార్, ఎస్‌ఐలు నారాయణ రావు, మురళీ సంఘ మేశ్వరరావు,ఆర్‌ఎస్‌ఐ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపురం ట్రాఫిక్ సీఐగా వాసుదేవ్ బాధ్యతలు స్వీకరణ



మల్కాపురం : మల్కాసురం ట్రాఫిక్ సీఐగా వాసుదేవ్ శని వారం పదవీ బాధ్యతలు స్వీక రించారు. గత సీఐ భాస్కర రావు స్దానంలో కొత్తగా వచ్చిన వాసుదేవ్‌కు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్బంగా ఆయన మాట్లా డుతూ ట్రాఫిక్ నిబందనలకు విరుద్దంగా ప్రవర్తించేవారికి కటిన చర్యలు తప్పవని, అలాగే నూతన సంవత్సర వేడుకల్లో యువత మద్యం సేవించి వాహనం నడపకూడదని, అలా ఏవరైనా దొరికితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

## నేడు హిందూ సనాతన సాంస్కృతిక సమ్మేళనం

సబ్బవరం : మండలంలోని స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఈనెల 30న (ఆదివారం) సబ్బవరం మండలం సమరత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో మురుగున పడుచున్న మన హిందూ సనాతన సాంస్కృతిక కళలు పునరుద్ధరించే భాగంగా హిందూ సనాతన సాంస్కృతిక సమ్మేళన నిర్వహించబడునని ధర్మ ప్రచారక కమిటీ అధ్యక్షుడు పి.వి.పట్నాయిక్, కన్వీనర్ అనకాపల్లి వెంకటరమణ ఒక ప్రకటనలో విలేకర్లకు తెలిపారు. ఈ సాంస్కృతిక సమ్మేళనకు ముఖ్య అతిధిగా బాల బ్రహ్మేంద్ర సరస్వతి స్వామి వారు పాల్గొని ఆదివారం ఉదయం 10 గంటలకు సబ్బవరం పాతరోడ్డు కూడలి నుండి హరిదాసు, బుడిత జంగాలు, గంగిరెడ్లు, భజన సంఘాలు, చిటికెల భజనలు, చెక్క భజనలు తదితర కళా కారులతో ఊరేగింపుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు నిర్వహించ బడును. అనంతరం సీతారామ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో కళాకారులు, గురువులకు సన్మానం చేయుట జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాకారులు, భజన బృందాలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

## పట్టణంలో పందుల నియంత్రణకు చర్యలు

విజయనగరం : పట్టణంలో పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ టి.వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలో శనివారం 12 పందులను షూట్‌చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ పందుల నియంత్రణకు అడ్డుపడేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందుల పెంపకందారులు పట్టణానికి దూరంగా పందులను పెంచుకోవాలని సూచించారు. పట్టణంలో ఇష్టా రాజ్యంగా వదిలిపెడితే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే ఇళ్లలో, హోటళ్లలో మిగిలిన ఆహార పదార్థాలను కాలువల్లో, బయట ప్రదేశాల్లో వేయవద్దని విజ్ఞప్తి చేశారు. మిగిలిపోయిన ఆహారపదార్థాలను పురపాలక వాహనాలకు అందజేయాలని సూచించారు. ప్రజలు సహకరించినప్పుడే పందుల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.

## పెరిగిన టమాటా ధరలు

గొలుగొండః టమాటా ధరలు పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం 20 కేజీల ట్రే మార్కెట్‌లో రూ.170 వరకు విక్రయించగా, ప్రస్తుతం ఇదే ట్రే రూ.280కు అమ్మకాలు జరుగుతున్నాయి. గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్న రైతులకు పెరిగిన ధర ఊరటనిచ్చింది.

### *శ్రీక్షేత్రమ్‌లో లక్షతులసి పూజలు*

విజయనగరం: ప్రముఖ భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై యున్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంక టేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా లక్ష తులసి పూజలు జరిగాయి. శనివారం ఉదయం దేవాలయం ప్రధాన అర్చకులు అంపోలు లక్ష్మీ నరసింహా చార్యులు ఆధ్వర్యంలో చామర్తి రమేష్, మహేష్ తది తర వేదపండితుల సహ కారంతో వేద మంత్రాల నడుమ శ్రీనివాసునికి లక్ష తులసి పూజలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో దుర్గా బాలాజీ, ఉమాదేవి దంప తులు, నీరజ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.









### సత్యదేవుని నమూన ఆలయంలో

## సత్యదేవున్ని దర్శించిన మంత్రి గంటా



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం స్థానిక బైపాస్ రోడ్డు నందు ఉన్న సత్యదేవుని నమూన ఆలయం వద్ద సత్యదేవున్ని మంత్రి గంటా.శ్రీనివాసరావు కాకినాడ నుండి విశాఖ వెళ్తూ శనివారం సాయంత్రం ప్రత్యేకంగా శ్రీ స్వామివార్ని దర్శించారు. ఆయనకు ఆలయం వద్ద అక్కడ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ఏనుగు.త్రీమూర్తులు, శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

## రేపు దివ్యంగులకు ఆటల పోటీలు

యానాం: పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు నేతృత్వంలో యానాం సాంఘిక సంక్షేమశాఖ, యానాం రిపోర్టర్స్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యం లో 31వ తేదీన యానాంలోని దివ్వంగులకు ఆటలపోటీలు నిర్వహించడం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు దున్న చక్రవర్తి తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యంగులకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి అనం తరం బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుంది. స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు, పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మ ణ్యేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ జి. గౌరీ సరోజ, విద్యాశాఖ అధికారి కాలెసాయినాథ్, యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గిడ్ల సత్య నారాయణ, తదితరులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో యానాంలోని దివ్యంగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అధ్యక్షులు దున్న చక్రవర్తి కోరారు.

## చంద్రబాబుకి కౌంటుడౌన్ మొదలైంది

### -బోత్స సత్యనారాయణ

విశాఖపట్నం: తమ పార్టీ అధికారంలోకి వస్తే నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ అందిస్తామని చెప్పిన టిడిపి, బిజెపి పార్టీలు వాటిని అమలు చేయడంలో వైఫల్యం చెందాయని మాజీ మంత్రి వైసిపి నాయకులు బోత్స సత్యనారాయణ అందోళణ వ్యక్తం చేశారు నేడు మద్దిలపాలెం దరి పార్టీ కార్యాలయంలో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ చంద్రబాబుకి కౌంటుడౌన్ మొదలైందని తెలియజేశారు.

2019 ఎన్నికలలో తిరిగి టీడీపీ ప్రభుత్వం రాదన్న భయం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పట్టుకొందని స్పష్టం చేశారు హైకోర్టు విభన పై సీఎం చవకబారు రాజకీయాలు చేస్తున్నారు అని అందోళణ వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకి భయపడి విజయవాడ వచ్చేసిన రాష్ట్ర ముఖ్య మంత్రి రాష్ట్ర ప్రజలను కూడా అదే విదంగా మోసం చేసారని ఎద్దేవా చేసారు. ప్రజాసంక్షేమం తెలుగువారి ఆత్మగౌరవం కోసం డిల్లీలో ప్రదాని నరేంద్ర మోడీని 29 సార్లు కలిసానని పదేపదే కలిసానన్న చంద్రబాబు నాయుడు ఒక్క సారైనా ప్రత్యక హోదా పై స్పష్టత ఇచ్చారా అని ప్రశ్నించారు. ఒక్క లేఖలోనైనా ప్రత్యక హోదా రాసి ఉంటే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పు కొంటానన్నారు.

## "18వ" రోజుకు చేరిన దీక్షలు



అనకాపల్లి : టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 18వరోజుకు చేరుకున్నాయి.

ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం చూస్తే రైతులంటే ఈ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. రైతులతో కలిసి ఉద్యమాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారిలో మార్పు వచ్చే వరకూ ఆందోళన మరింత ఉధ ృతం చేస్తామని హెచ్చరించారు. అనకాపల్లి ఆర్డీవో మాత్రం రైతులను కలవకుండా ముఖం చాటేయడం బాధాకరమన్నారు.

రైతులకు న్యాయం జరిగే వరకూ దశల వారీగా ఆందోళన ఉధ ృతం చేస్తామని సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, బోరరాజు, ఉరుకూటి బాబూరావు, జనసేన నాయకులు దాడి బుజ్జి, ఉమర్ , సురభి హరీష్ , గల్లా వినోద్, పాము పైడిరాజు, మళ్ళ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత హెూమియో వైద్య శిబిరం

విశాఖపట్నం: "స్ఫూర్తి" సేవా సంస్థ వారు ప్రతినెల ఆఖరు ఆదివారం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు ఆఖరు ఆదివారం అయిన నేడు పెందుర్తి దగ్గర సరిపల్లి గ్రామంలోగల శ్రీసాయిబాలాజీ నగర్ లేఅవుట్‌లో ఉన్న స్ఫూర్తి సేవాసదన్ అనే భవనంలో ఉచిత హెూమియో వైద్య శిబిరం ఉదయం 9.30 గంటలనుండి మధ్యాహ్నం 1 గంటవరకు ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.వి. భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించెదరు. రోగులను తనిఖీచేసి తగు సలహాలిచ్చేదరు. రోగులకు స్ఫూర్తి సేవా సంస్థవారు ఉచితంగా మందులిచ్చెదరని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, నేటితో 12వ సంవత్సరంలో ప్రవేశిస్తున్న సందర్భంగా అందరికీ నూత సంవత్సర శుభాకాంక్షలు స్వచ్ఛంద సేవా సంస్థ కార్యనిర్వాహక ధర్మకర్త నీలి జగదీశ్ తెలియజేశారు.

### పాలిథిన్ సంచులు వాడితే చర్యలు

తాళ్లరేవు: మండలంలలోని 17 పంచాయతీలలో దుకాణాలలో పాలిథిన్ సంచులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడివో సిహెచ్ చినబాబు హెచ్చరించారు. వివిధ గ్రామాలలోని ఉన్న దుకాణాలను అధికర బృందం పరిశీలించారు. దుకాణాలవద్ద కొనుగోలుచేసిన సరుకులకు ప్లాస్టిక్ సంచులలో వినియోగదా రులకు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాడిమొగ పంచాయతీ పరిధిలోని గోపాలపురం, బాబానగర్ గ్రామాలలో తాహశీల్దార్ లోథాజోసప్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీచేసారు. సొల్లంగి పేటలో మండల ఇంజనీరు నున్నా వెంకటేశ్వరరావు, పి. మల్లవరంలో ఇవోపిఆర్‌టి జొన్నాడి వెంకటేశ్వరరావు, కోరంగిలో వ్యవసాయాధికారిణి ఎ. సిరి గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

### పెరిగిన మద్యం విక్రయాల ఆధాయం

యానాం: కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరికి మద్యం విక్రయాలద్వారా రూ. 46 కోట్లు అదనపు ఆదాయం లభించింది. గత ఏడాది డిసెంబర్ చివరినాటికి రూ. 527 కోట్లు రాగా ఈ ఏడాది 573 కోట్లు వచ్చినట్లు డిప్యూటీ ఎక్సైజ్ అధికారి కె. దయాలన్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు పుదుచ్చేరి వచ్చి ఘనంగా జరపుకునే పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగు తుండటంతో మరింత ఆదాయం వస్తుందని అంచనావేస్తున్నారు. గత ఏడాది రూ. 741 కోట్లు ఆదాయం రాగా ఈ ఏడాది ఎక్సైజ్ ద్వారా రూ. 815 కోట్లు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మెండి బకాయిలు పెంచిన పన్నుల కారణంగా ఆదాయం పెరిగిందన్నారు.

#### ఇంటి పన్ను చెల్లించేందుకు

### ఆదివారం ప్రత్యేకకౌంటర్లు

**జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ ఎస్ .రమణమూర్తి**

కంచరపాలెం : గృహ యజమానులు సౌకర్యార్థం ఆదివారం ప్రత్యేకకౌంటర్లు అందుబాటులో వుంటాయని జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ ఎస్ .రమణమూర్తి పెర్కొన్నారు. ఈ మేరకు జ్ఞానపురం జీవీఎంసీ జోన్ -4 కార్యలయం వద్ద ఆదివారం సైతం ప్రజలు ఆస్థి పన్ను చెల్లించుకునేందుకు ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటు చేశామని తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు .

## భీమా పంపిణీ



భీమునిపట్నం: తగరపువలస స్థానిక 9వవార్డు, రాజవీధిలో మృతి చెందిన శీల విజయకుమారి కుటుంబం నకు చంద్రన్నభీమా తక్షణ సహాయం రూ.5వేలు తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పలరమేష్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. చంద్రన్నభీమా ఇంకా ఎవరు చేయించకపోయిన వెంటనే చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పల.కృష్ణ,తమ్మిన సూరిబాబు, కుమిలి తిరుపతి రావు,బంక శ్రీను, రమణ, భీమా మిత్ర పోతిన. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

### ఈ రోజు 1 నుంచి 13,28వార్డులకు సభ్యత్వ నమోదు

భీమునిపట్నం: తగరపువలస టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం అనగా ఈ రోజు తగరపువల తాతా ధియే టర్ వద్ద ఉన్న జగదాంబ కాంప్లెక్స్ నందు జరుగునని డివిజన్ అధ్యక్షులు కొప్పలరమేష్ అన్నారు. 1 నుంచి13 వార్డులు, 28వార్డు కు జరుగుననీ నమోదు చేయించుకోవలసిన వారు చేయించు కోవాలనీ ఆయన కోరారు.

## అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

యానాం: సావిత్రినగర్ క్రిష్ణానగర్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లుకాలిపోయి కట్టుబట్లతో మిగిలిన నాలుగు బాధిత కుటుంబాలకు యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తిరుకోటి బైరవస్వామి పరామర్శించారు.

ఈ సందర్భంగా అగ్నిప్రమాద బాధితులు పంతాడిరాజు, చింతా వీర్రరాజు, పోలేటి వీరబాబు, మల్లాడి లోకరక్షడు, కుటుంబాలకు పాక్షికంగా దబ్బతిన్న కుటుం బాలకు బియ్యం దుస్తులు, నగదు అందచేశారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం వచ్చేలా కృషిచేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు నల్లా వెంకన్న, కాంట్రాక్టర్ల అసోసియేషన్ నాయకుడు మల్లాడి శామ్యూల్ ఎన్ఆర్ పార్టీ ఉపాధ్యక్షుడు తిరుకోటి నాగేశ్వరరావు, చింతలపూడి సత్యనారాయణ, డి. శ్రీహరి, ఎస్. శ్రీధర్, డి. ధర్మారావు, ఆర్. అచ్చియ్య, కె. పెర్రాజు, బి. శ్రీను, పి. బాబి, చింతా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు దేశం సభ్యత్వాలు నమోదు



భీమునిపట్నం: భీమిలి డివిజన్ 19వార్డు లో తెలుగు దేశంపార్టీ క్రియాశీల సభ్యత్వాలు ప్రారంభమయ్యాయి. మొదటి సభ్యత్వం తెలు గు దేశం పార్టి సీనియర్ నాయకులు కట్టమూరి. సత్యనారాయణకు భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు అందజేసారు. ఈ సందర్భంగా గంటానూకరాజు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్ర మమని అన్నారు. చంద్రబాబు సారధ్యంలో నడుస్తున్న ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ కుటుంబ సభ్యులందరు శాశ్వత సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. వంద రూపాయలు కట్టి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. చంద్ర బాబు నాయుడు పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. గత 30ఏళ్ళుగా జరగని అభివృద్ధి ఈ నాలుగు న్నర ఏళ్ళలో జరిగిందని అన్నారు. ఈ కార్య క్రమంలో 19వ వార్డు జన్మభూమి కమిటీ సభ్యు లు కంచెర్ల కామేష్, వాడమొదలు సత్యా రావు, కాగుపాటి శంకర్, తెలుగుదేశం పార్టీ నాయ కులు, భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మ వారి దేవస్థానం చైర్మన్ కాసరపు నాగరాజు, ఆర్గ నైజింగ్ సెక్రటరీ గిడుతూరి శ్రీనివాసరావు, అధి కార ప్రతినిధి మారోజు సంజీవకుమార్, ప్రచార కార్యదర్శి ఊళ్ళ దుర్గారావు, గండిబోయిన పోలిరాజు, గూడుపు రాజు, మట్టా దాసు, కొక్కిరి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం మునిసిపాలిటీలో ఓపెన్ ఫారం




పెద్దాపురం: శరవేగంగా కార్పొరేషన్ స్థాయికి పెరుగుతున్న పెద్దాపురం పట్టణంలో నిర్మాణా లు అధికం కావడంతో ప్రతి శుక్రవారం మున్సి పల్ కార్యాలయంలో "ఓపెన్ ఫారం"ను ఏర్పాటు చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి భాస్కరరావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణంలోను పరిదిలోను నిర్మిస్తున్న భవనాలకు, లే అవుట్లకు, పరిశ్రమలకు, రోడ్ల విస్తరణలకు తప్పనిసరిగా ముందుముని పాలిటీ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. ఈ ఫారం వలన ప్రజల సమస్యలు పరిష్కరించి సహకరించడం, తక్షణ అనుమతులు మంజూ రు చేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో పెద్దాపురం మునిసిపాలిటీలో 90 శాతం డేటాను ఆన్‌లైన్‌లో పెట్టబడినదని ఇది జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని ఆయన తెలిపారు. పట్టణంలో పి. చంద్రకుమార్ లైసెన్సు సర్వేయర్ల అధ్యక్షులు శ్రీనివాస్, ఎంవిఎస్ ప్రసాద్, ఎండి మిరాజీ అలీలు సర్వేయర్లుగా ఉన్నారని తెలిపారు. టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్‌గా సంయుక్త విధులు నిర్వహిస్తున్నారని టిపిఓ తెలిపారు.

## 6వ విడత జన్మభూమి – మా ఊరు

పెద్దాపురం: జనవరి 2 నుండి 11వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించనున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దాపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎన్ఎస్‌విబి వసంతరాయుడు తెలిపారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో 6వ విడత జన్మభూమిపై సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రబుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తివివరాలతో హాజరై ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించాలని తెలిపారు. ఏ రోజుకారోజు జన్మభూమి యొక్క నివేధికను సాయంత్రంలోగా జిల్లా అధికారులకు తెలియచేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సామర్లకోట,పెద్దాపురం మండల ప్రత్యేక అధికారులు మల్లిఖార్జునరావు, ఎ. రాజశేఖర్, తహశిల్దార్ బాలసుబ్రహ్మణ్యం, ఎంపిడిఓ పి. వసంతమాధవి, జగ్గారావు, సామర్లకోట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, పెద్దాపురం మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, ఎఎస్‌డబ్ల్యు ఓ గాయత్రి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## అవంతీ ఇంజినీరింగ్ కళాశాలలో ముగిసిన వైజ్ఞానిక వేడుకలు



భీమునిపట్నం: తగరపువలస అవంతీ ఇంజినీరింగ్ కళాశాలలో జ్ఞాన 2కె 18 జాతీయ స్థాయి వైజ్ఞానిక వేడుకులు శనివారం ముగిసాయి ఈ కార్యక్రమానికి ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వైజ్ఞానిక వేదికలు ద్వారా విద్యార్థులలోని సృజనాత్మకతను మేల్కొల్పవచ్చని నిష్ణాయుతులైన విద్యాసంస్థల ఆచార్యులు పారిశ్రామిక అనుభవజ్ఞుల ఉపన్యాసాల ద్వారా విద్యార్థులను ఉన్నత స్థాయికి గమ్యాలు చేర్చుటకు ఒక మార్గం ఏర్పడతాయని ఇలాంటి ప్రతీ చిన్న విషయానికి అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలియజేసారు. ఆంద్ర విశ్వ విద్యాలయం రిజిస్టర్ డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ప్రతీ ఇంజినీరింగ్ విద్యార్థి చదవు తో పాటు నిత్య జీవితంలో జరిగే ప్రతీ సంఘటనూ పరిశోదణా దృక్పదం తో పరిశిలించి భవిష్యత్ తరాలకు సరళమైన సాంకేతిక పరిజ్ఞానంతోను ఈ సమాజానికి అందిచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతీ విద్యాసంస్థల చైర్మన్ మరియు అనకాపల్లి ఎం.పి.ముత్తంశెట్టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నాయకత్వ సామాజిక విలువల మరియు శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలుఅవసరం అని వీటిని ఇలాంటి సదస్సుల ద్వారా విధ్యార్థులల్లో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలను రూపొందించ వచ్చు అని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్ వి.గణేష్ మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా విద్యార్థులలోని సామర్ద్యాన్ని వెలికితీయడానికి పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మద్య విద్యా మరియు సాంకేతిక పరమైన దూరాన్ని తగ్గించవచ్చు అని అన్నారు. పోటీలలో గెలుపొందిన వారి కీ సర్టిఫికేట్ లు అందజేసారు. విద్యార్థులకు ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుండి సుమారు వెయ్య మంది విద్యార్థులు పాల్గొ న్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో,జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎమ్ ప్రియాంక,ఎం.డి శ్రావణ కుమార్,వైస్ ప్రిసిడెంట్ ఎం.నంధిష్ డైరెక్టర్ లు ఎ,చంద్రశేఖర్ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నూకాంబికాను దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

అనకాపల్లి ... అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని శు క్రవారం సాయంత్రం వెనుక బడిన తరగతుల శాఖకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీ వి. విజయలక్ష్మి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వేదపం డుతులు ఆశీర్వదించారు. ఆర్డీవో సూర్యకళ కార్యనిర్వాహ ణాధికారి సుజాత, ఆలయ అభివృద్ది కమిటీ సభ్యులు మళ్ల సురేంద్ర, ఎస్ఎంకే జోగినాయుడు, ఆమెతోపాటు ఉన్నారు. అమ్మవారి చిత్ర పటాన్ని, తీర్ద ప్రసాదాలను ఆవిడకు అందజేసారు.

## ఘనంగా శ్రీతులసీ కళ్యాణ మండపం, పాలకేంద్రం ప్రారంభోత్సవం

యలమంచిలి: విశాఖజిల్లా యలమంచిలి మూడవ వార్డు పరిధి సోమలింగపాలెం గ్రామంలోని శ్రీతులసీ కల్యాణ మండపం ప్రారంభోత్సవాన్ని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కళ్యాణమండపం సోమలింగపాలెం విశాఖడెయిరీ రైతుల ఉమ్మడి ఖాతా నుండి సుమారుగా రూ.3.8లక్షలు వెచ్చించి సభ్య రైతుల సౌకర్యర్ధం మొదటి ఫ్లోర్ నందు పాల సేకరణకు అనుగుణంగా నిర్మించారు. మొదటి అంతస్తు పాలకేంద్రంకు అనుకొని ఉన్న వెనుకభాగం సగం కళ్యాణ మండపంలో ఏ శుభకార్యాలు జరిగినా వంటలు చేసేలా వంటలకు వీలుగా నిర్మించారు. చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ యూనిట్ మేనేజర్ ఎన్ .నాగేశ్వరరావు, నారాయణపురం బిసిసి సీనియర్ సూపర్‌వైజర్ డి.రామచంద్రనాయుడు, సోమలింగపాలెం కౌన్సిలర్ యల్లపు గోపి, సోమలింగపాలెం తెలుగుదేశం సీనియర్ నాయకులు యల్లపు నాగునాయుడు, మాజీ సోమలింగపాలెం సంస్థ అధ్యక్షులు వేగి ఆదినారాయణ, యల్లపు పరమేశ్వరరావు, కాబోయే అధ్యక్షులు యల్లపు శ్రీను, సోమలింగపాలెం రెండవ తెలుగుదేశం వర్గ సభ్యులు అందరూ పాల్గన్నారు.

# కాజల్ అశ్లీల సన్నివేశంపై దుమారం..



కాజల్ అగర్వాల్ తొలిసారి నటిస్తున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం ప్యారిస్ ప్యారిస్. ఈ చిత్రం హిందీ బ్లాక్ బస్టర్ మూవీ క్వీన్ చిత్రానికి రిమేక్ గా తెరకెక్కుతోంది. క్వీన్ చిత్రంలో కంగనా రనౌత్ నటించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి గాను కంగనా రనౌత్ పాత్రకు ప్రశంసలు లభించాయి. ఈ చిత్రాన్ని మనుకుమారన్ అనే నిర్మాత సౌత్ ఇండియన్ అన్ని భాషల్లో నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళీ, కన్నడ భాషలకు వేరువేరు హీరోయిన్లని, వేరు వేరు దర్శకులని ఎంపిక చేసుకుని రూపొందిస్తున్నారు. తమిళంలో కాజల్ అగర్వాల్ నటిస్తోంది. కాజల్ అగర్వాల్ నటిస్తున్న ప్యారిస్ ప్యారిస్ చిత్రానికి రమేష్ అరవింద్ దర్శకుడు. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ తన ఊరి నుంచి ప్యారిస్ కు ఒంటరిగా హనీ మూన్ కు వెళ్లే యువతిగా నటిస్తోంది. చాలా చిత్రాల్లో కాజల్ గ్లామర్ పాత్రలు చేసింది. కానీ ఈ చిత్రం పూర్తిగా నటనపై ఆధారపడి ఉండే చిత్రం. ఇటీవల విడుదలైన టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. కానీ అందులో ఓ సన్నివేశం మాత్రం తీవ్ర వివాదంగా మారింది. టీజర్ లో చూపిన విధంగా కాజల్ అగర్వాల్ పక్కనే ఉన్న యువతీ ఆమె ప్రైవేట్ భాగాలపై చేయి వేస్తుంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాజల్ పై విమర్శలు చెలరేగాయి. కాజల్ ఎంతగా అందాలు ఆరబోసినా ఎప్పుడూ హద్దులు దాటలేదు.. వల్గర్ గా నటించలేదు. కానీ ఈ సన్నివేశం చూసాక కాజల్ అభిమానులే ఫీల్ అవుతున్నారు. ఈ వివాదంపై కాజల్ అగర్వాల్ స్పందించలేదు కానీ చిత్ర దర్శకుడు రమేష్ అరవింద్ స్పందించాడు. కేవలం టీజర్ మాత్రమే చూసి సినిమాపై విమర్శలు చేయడం సరికాదు అంటూ దర్శకుడు ఆ సన్నివేశాన్ని సమర్థించుకున్నారు. సినిమాలో అంతకు ముందు వచ్చే సన్నివేశం చూస్తే ఆ సీన్ ఎందుకు పెట్టామో మీకు అర్థం అవుతుంది. ఇలాంటి సన్నివేశం హిందీ క్వీన్ లో కూడా ఉంది. ఆ చిత్రం జాతీయ అవార్డు సొంతం చేసుకుందని తెలిపారు. కాజల్ ఇప్పటికి సౌత్ లో బిజీ స్టార్ గా కొనసాగుతోంది. తెలుగులో తేజ దర్శత్వంలో ఓ చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి సీత అనే టైటిల్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తమిళంలో ప్యారిస్ ప్యారిస్ చిత్రంలో నటిస్తుండగా కమల్ హాసన్, శంకర్ కాంబోలో తెరకెక్కుతున్న క్రేజీ చిత్రం ఇండియన్ 2లో అవకాశం దక్కించుకుంది.

# శత్రువులతో కాళీ ఆట



రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం పేట్ట. కార్తిక్ సుబ్బరాజు దర్శకుడు. ఈ చిత్రాన్ని పేట పేరుతో నిర్మాత అశోక్ వల్లభనేని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. సిమ్రన్, త్రిష, నవాజుద్దీన్ సిద్ధిఖీ, విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలకానుంది. శుక్రవారం చిత్రబృందం తమిళ ట్రైలర్‌ను విడుదలచేసింది. నిర్మాత మాట్లాడుతూ ట్కస్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో రజనీకాంత్ కాళీ అనే పాత్రలో కనిపిస్తారు. హాస్టల్ వార్డెన్‌గా, డాన్‌గా భిన్న పార్శ్వాలతో ఆయన పాత్ర సాగుతుంది. కాళీ ఎవరు? అతడి నేపథ్యమేమిటి? శత్రువులతో ఆడిన ఆటలో కాళీ ఎలా గెలుపొందాడన్నది ఆకట్టుకుంటుంది. రజనీకాంత్ నటన, పాత్రచిత్రణ అలరిస్తాయి. నటుడిగా ఆయన్ని కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది. సర్కార్, నవాబ్ తర్వాత మరో మంచి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించడం ఆనందంగా ఉంది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రం విడుదలకానుంది అని తెలిపారు. బాబీసింహా, మేఘా ఆకాష్, శశికుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, ఛాయాగ్రహణం: తిరుణవుక్కరసు, ఎడిటింగ్: వివేక్ హర్షన్.

# ఓ మనిషి నీవు ఎవరు?




రిజ్వాన్ కలసిన్ ప్రధాన పాత్రధారిగా స్వర్ణ క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రం ఓ మనిషి నీవు ఎవరు. స్వర్ణ కుమారి దొండపాటి నిర్మాత. కృష్ణమూర్తి రాజ్‌కుమార్ దర్శకుడు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నటుడు సుమన్ క్లాప్‌నివ్వగా, చలపతిరావు కెమెరా స్విఛాన్ చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో కూడిన భక్తి ప్రధాన చిత్రమిది. ఇందులో యోహాన్ అనే కీలక పాత్రను పోషిస్తున్నాను అని తెలిపారు. ఏసుక్రీస్తు జీవితంలో తెలియని కోణాలను ఆవిష్కరిస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నాం. సంక్రాంతి తర్వాత విజయవాడలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. గుడ్‌ఫ్రైడే సందర్భంగా సినిమాను విడుదల చేస్తాం నిర్మాత చెప్పారు. చలపతిరావు, జూ రేలంగి, జెన్నీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: జి.విజయ, ఆర్ట్: సుభాష్.

# చిత్రభాను

# ప్రభాస్‌తో కేజీఎఫ్ డైరెక్టర్..

కేజీఎఫ్ విజయంతో విమర్శకుల ప్రశంసలు అందుకొంటున్న ప్రశాంత్ నీల్‌కు ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. కేజీఎఫ్ సినిమాతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించాడు ప్రశాంత్. ఇప్పుడు దక్షిణాదిలోని ప్రముఖ సినీ నిర్మాతలందరూ ప్రశాంత్‌పై నజర్ పెట్టారు. అయితే తాజాగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్‌తో సినిమా చేసేందుకు యూవీ క్రియేషన్ ఒప్పందం కుదుర్చుకొన్నారనే వార్త వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. కేజీఎఫ్ బంపర్ హిట్ తర్వాత ప్రశాంత్ నీల్‌ను ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్ సంప్రదింపులు జరిపిందట. ఆయనతో మాస్ అంశాలు ఉన్న సినిమాను డైరెక్ట్ చేయించే పనిలో ఉంది అని తెలుగు మీడియాలో ఓ వార్త వైరల్‌గా మారింది. ప్రశాంత్ కూడా అందుకు సముఖంగా ఉన్నట్టు సమాచారం. సొంత బ్యానర్‌లో ప్రశాంత్‌తో ప్రభాస్ యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తన సొంత బ్యానర్ యూవీ క్రియేషన్‌లో ఓ సినిమా చేయనున్నారు. ఆ సినిమా కోసమే యూవీ క్రియేషన్ ప్రశాంత్‌తో చర్చలు జరిపినట్టు తెలిసింది. ప్రభాస్‌ను డైరెక్ట్ చేయడానికి ఆయన సిద్ధంగా ఉన్నట్టు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కన్నడ చిత్ర పరిశ్రమలో శ్రీ





మురళీ అనే హీరోతో ఉగ్రం అనే సినిమాతో ప్రశాంత్ నీల్ డైరెక్టర్‌గా మారాడు. ఉగ్రం సినిమా నేరేషన్, టేకింగ్, కథ, నటీనటుల ఫెర్మామెన్స్ శాండల్ ఉడ్‌లో ప్రశంసలు అందుకొన్నది. విమర్శకులు ప్రశాంత్ పనితీరు ప్రశంసించారు. ఆ తర్వాత కేజీఎఫ్ సినిమాతో ప్రశాంత్ మరోసారి భారీ సక్సెస్‌ను చేజిక్కించుకొన్నారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేసిన కేజీఎఫ్ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో రూ.28.5 కోట్లు వసూలు చేసింది. వారాంతంలో కూడా భారీ కలెక్షన్లు సాధించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కేజీఎఫ్ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌ను దాటి.. 150 కోట్ల క్లబ్ వైపు పరుగులు పెడుతుంది.

# కామ్రేడ్ ప్రేమయుద్ధం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం డియర్ కామ్రేడ్. ఫైట్ ఫర్ వాట్ యు లవ్ ఉపశీర్షిక. భరత్ కమ్మ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, బిగ్‌బెన్ సినిమాస్ పతాకాలపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, మోహన్ చెరుకూరి(సి.వి.ఎం), యశ్ రంగినేని నిర్మిస్తున్నారు. రష్మిక మందన్నా కథానాయిక. 2019 మే ప్రథమార్థంలో ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదలచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ భావోద్వేగాలు, నాటకీయత, యాక్షన్ హంగులకు సందేశాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. ప్రేమించే వాటి కోసం యుద్ధం చేయాలనే పాయింట్‌తో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. సామాజిక బాధ్యత కలిగిన యువకుడిగా శక్తివంతమైన పాత్రలో విజయ్ దేవరకొండ కనిపిస్తారు. స్టూడెంట్ బ్యాక్‌డ్రాప్‌లో వినూత్నమైన కథాంశంతో దర్శకుడు భరత్‌కమ్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కాకినాడలో పూర్తయిన తాజా షెడ్యూల్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. ఇప్పటివరకు నాలుగు షెడ్యూళ్లు పూర్తయ్యాయి. గీతగోవిందం తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా కలయికలో తెరకెక్కుతున్న చిత్రమిది. వారి కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, సినిమాటోగ్రఫీ: సుజిత్ సారంగ్, సంభాషణలు: జె.కృష్ణ, కళా దర్శకత్వం: రామాంజనేయులు.



# నితిన్‌తో రొమాన్స్!

ఈ ఏడాది తెలుగులో సినిమాలు చేయలేదు రకుల్‌ప్రీత్‌సింగ్. తమిళ, హిందీ భాషలపై దృష్టిసారించిన ఆమె టాలీవుడ్‌కు పూర్తిగా దూరంగా ఉన్నది. ప్రస్తుతం తెలుగులో పూర్వవైభవాన్ని సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నది ఈ పంజాబీ సొగసరి. విభిన్న కథాంశాలతో ఇతర భాషల్లో నటించిన సినిమాలు మంచి ఫలితాల్ని అందివ్వడంతో తెలుగులో అదే ఫార్ములాను అనుసరించాలని రకుల్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తాజాగా ఆమె ఓ ప్రయోగాత్మక చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో నితిన్ కథానాయకుడిగా ఓ సినిమా రూపొందనున్నది. ప్రయోగాత్మక కథాంశానికి వాణిజ్య విలువల్ని జోడించి దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్‌సింగ్ కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తాయి. ఇటీవలే చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. కథలో తన పాత్రకున్న ప్రాధాన్యత నచ్చడంతో ఆమె ఈ సినిమా చేయడానికి అంగీకరించినట్లు తెలిసింది. గత సినిమాలకు పూర్తి భిన్నంగా ఢీ గ్లామర్ లుక్‌తో ఆమె పాత్ర సాగనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సెట్స్‌పైకి రానున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం రకుల్‌ప్రీత్ సింగ్ తమిళంలో ఎన్‌జీకే, దేవ్‌తో పాటు మరో సినిమాలో నటిస్తున్నది. హిందీలో రెండు చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నది.

### శ్రీచరణుల ఆశీర్వాదం మహత్తరమైనది

## నేను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచాను

### హుసానాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్



విశాఖపట్నంః షణ్మత స్థాపనాచార్య జగద్గురు శంకరాచార్య విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారి దివ్య ఆశీర్వాద బలంతో తాను టీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసి మళ్లీ గెలుపొందానని హుసానాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే వి. సతీష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం తాను కుటుంబ సమేతంగా శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారిని కలిసి వారి దివ్య ఆశీస్సులు పొందారు. పీఠప్రాంగణంలో గల సమస్త దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లు స్వామి వారి దివ్య ఆశీస్సులు ఉంటే ఎంతటిపనినైనా దిగ్విజయంగా సాధించి గెలుపొందగలననే ధీమా తనకు కలుగుతోందని సతీష్ కుమార్ పేర్కొన్నారు. అందువలనే తాను సకుటుంబ సమేతంగా శ్రీచరణుల దివ్య ఆశీస్సులు పొందేందుకై వచ్చినట్లు పేర్కొన్నారు.

## ఆకాశం నుండి అందాల వీక్షణం అద్భుతం

- సిద్ధమైన హెలిటూరిజం
- విశాఖ అందాలన్నీ ఒకే ప్యాకేజీలో
- జనవరి 16 వరకు హెలీటూరిజం
- నగర పోలీసు కమిషనర్ మహేశ్ చంద్ర లడ్డ





సిరిపురం: ఆకాశం నుండి ఒకపక్క అలల అందాలు, మరో పక్క కొండలు, భవనాల అందాలు అద్భుతంగా ఉన్నాయని పోలీసు కమిషనర్ మహేశ్ చంద్ర లడ్డ అభిప్రాయపడ్డారు. విశాఖ ఉత్సవాల్లో భాగంగా వి ఏం ఆర్ డి ఏ ద్వారా ఏర్పాటు చేసిన హేలీ టూరిజంను పోలీసు కమిషనర్ మహేశ్ చంద్ర లడ్డ, సంయుక్త కలెక్టర్ సృజన, వి ఏం ఆర్ డి ఏ కమిషనర్ బసంత్ కుమార్ శనివారం ప్రారంభించారు. పోలీసు కమిషనర్ తన తల్లి దండ్రులతో కలసి హెలికాప్టర్‌లో ప్రయాణించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రయాణం చాలా ఆనందంగా ఉందని అన్నారు. సంయుక్త కలెక్టర్ సృజన మాట్లాడుతూ అందాలన్నీ ఒక పాకేజ్‌లో చూసే అవకాశం హెలిటూరిజం వల్లనే కలుగుతుందని అన్నారు. వి ఏం ఆర్ డి ఏ కమిషనర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ పర్యాటక శాఖ సహకరిస్తే అరకు వరకు హెలి టూరిజంను పొడిగిస్తామని అన్నారు. గతం కంటే తక్కువ ధరకే టికెట్ ఉందని, పర్యాటక శాఖతో సంప్రదించి సబ్సిడీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. పర్యాటకులకు, ప్రజలకు ఇది అద్భుతమైన వినోద కార్యక్రమమని అన్నారు.

**ఈ నెల 31 నుండి జనవరి 16 వరకు హెలిటూరిజం**

తంబి ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి గోవింద్ మాట్లాడుతూ జనవరి 16 వరకు హెలిటూరిజంను కొనసాగిస్తామని తెలిపారు. జోయ్ రైడ్స్ పేరుతో నడుపుతూ విశాఖ అందాలను ఆకాశం నుండి చూపించడానికి రూ. 2400/- టికెట్ పెట్టారని, 8 నుండి 10 నిమిషాలలో సముద్రం మీదుగా సిటీ మధ్య నుండి తిప్పడం జరుగుతుందని, వివరాలకు 98805 05905/ 88847 44000 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శ్రీనివాస్, చీఫ్ అర్బన్ ప్లానర్ భవాని శంకర్, ఎస్.ఈ. రవి తదితరులు పాల్గొన్నారు.



## వైభవోపేతంగా అమ్మవారి రథయాత్ర



బురుజుపేటః ఆంధ్రభక్తుల కల్పవల్లి, భక్తుల కొంగుబంగారమైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు భక్తులకు ధాన్యలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఈ రథయాత్ర సాయంత్రం 4 గంటల నుండి దత్తత దేవాలయమైన సీతారామచంద్ర స్వామి దేవస్థానం, అంబికాబాగ్ నుండి ప్రారంభమైన బురుజుపేటలో గల కనక మహా లక్ష్మి అమ్మవారి ఆలయం వరకు వివిధ పులివేషాలు, నేల, మేళతాళాలతో, భజన మండలి వారితో వైభవోపేతంగా కొనసాగింది.

ఈ రథోత్సవంలో మాలధారణ చేసిన మాతలు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపకలెక్టర్ & కార్యనిర్వహణాధికారి ఎస్.జె. మాధవి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వి. రాంబాబు, పి. రామారావు, ఎస్. సూర్యకుమారి, పర్యవేక్షకులు రాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన గుర్తు గాజుగ్లాసుకు విస్తృత ప్రచారం

- పార్టీ గుర్తు గాజు గ్లాసుపై హర్షం
- ఈ ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తులు ఉండవు
- జనసేన నాయకుడు, మాజీ స్పీకర్ నాదేండ్ల మనోహర్



అన్నవరంః తూ.గో. జిల్లా అన్నవరం స్థానిక బైపాస్ రోడ్డు నందు ఉన్న సత్యదేవుని నమూనా ఆలయం ఎదురుగా ఉన్న టీ టైమ్ వద్ద జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసు గుర్తుపై ప్రచారంలో భాగంగా ఉత్తరాంధ్ర పర్యటన ముగించుకొని విజయవాడ వెళుతూ ఆగిన జనసేన నాయకుడు మాజీ స్పీకర్ నాదేండ్ల మనోహర్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజుకు కాకినాడ జనసేన నాయకులు పంతం నానాజీ, రాజా అశోక్ బాబు, తుమ్మల బాబు, పంతం గాంధీ మోహన్, వరుపుల తమ్మయ్య బాబు, కత్తిపూడి బాబి తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు నాదేండ్ల మనోహర్ మాట్లాడుతూ తమ పార్టీకి కేంద్ర ఎలక్షన్ కమీషన్ గాజు గ్లాసు కేటాయింపుపై తమ హర్షం వ్యక్తం చేసారు. శనివారం ప్రతీ పేద, మధ్య, ధనికుల కుటుంబాలలో తరచుగా వాడేది గాజు గ్లాసు. అలాగే ఏ టీ సెంటర్‌కి వెళ్లినా ఇప్పటికీ గ్లాజు గ్లాసుతోనే టీ తాగుతున్నారు. ఇప్పుడు ప్రతీ హైవేలలో ఒక టీ టైం పాయింట్ ఉంటుంది. అక్కడకు వెళ్లి టీ తాగిన వారికి గాజు గ్లాసుతో టీ ఇవ్వడం అనేది అనవాయితీ కావున ప్రజలు ఎప్పటికీ మరచి పోలేని గుర్తు గాజు గ్లాసు అని తెలిపారు. అదేవిధంగా త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎవరితోనూ పొత్తులు ఉండవని జనసేన ఒంటరిగానే 175 నియోజకవర్గాలలో పోటీ చేస్తుందని తెలిపారు.

## వాటర్ ఫాల్ ర్యాపలింగ్ పోటీలు విజయవంతం చేయాలి

### కమిషనరేట్ కార్యాలయంలో ట్రోఫీ ప్రారంభం

### స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సీపీ అభినందన



విశాఖపట్నంలోని ఎంతో సుందరమైన ప్రదేశమయిన కటిక జలపాతల వద్ద వాటర్ ఫాల్ ర్యాపలింగ్ వరల్డ్ కప్ సాహస క్రీడకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్న స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా అభినందించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ట్రోఫిని శనివారం కమిషనర్ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ఫాల్ ర్యాపలింగ్ వరల్డ్ కప్ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలను స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరిన్ని చేపట్టాలని ఆయన అన్నారు. ముఖ్యంగా అతి కష్టతరమైన వాటర్ ఫాల్ ర్యాపలింగ్ పోటీలో పాల్గొంటున్నవారు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకవైపు జర్నలిస్టు వృత్తిని, మరోవైపు సంక్షేమ, సామాజిక కార్యక్రమాలు, సాహస క్రీడలు వంటివి చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బంగారు అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. రిషి, ఎన్.అజయ్ కుమార్, సహాయ కార్యదర్శి కె.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

### విశాఖ ఉత్సవ్‌లో పుష్పాల అలంకరణ దృశ్యం








## ఏపీ పోలీస్ శాఖలో పదోన్నతులు

### నగర సీపీ మహేష్ చంద్ర లడ్డ



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్‌కు 20 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారికి పదోన్నతులు రానందున రాష్ట్ర ప్రభుత్వం వారందరికి పదోన్నతులు ఇవ్వాలనే సదుద్దేశంతో జిఓ నెం. 202 హోం సర్వీస్ 3, తేది ఈ నెల 28 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2585 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను 2019 హెడ్ కానిస్టేబుల్, 566 అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకొనుట జరిగింది. పై కారణముగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 116 హెడ్ కానిస్టేబుల్, 30 అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ పోస్టులు అదనముగా చేర్చడమైంది. అందువలన విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 43 పోలీస్ కానిస్టేబుల్‌లకు హెడ్ కానిస్టేబుల్‌లుగా, 30 హెడ్ కానిస్టేబుల్‌లకు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌లుగా పదోన్నతులు ఇస్తూ కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్డా 29న ఉత్తర్వులు జారి చేశారు. 169 మంది పోలీస్ కానిస్టేబుల్‌లకు విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ప్రీ ప్రమోషనల్ ట్రైనింగ్ ఇచ్చి త్వరలోనే హెడ్ కానిస్టేబుల్‌లుగా, పదోన్నతులు ఇవ్వడం జరుగుతోంది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com